జమ్మికుంటలో భానుడి భగభగ

● రాష్ట్రంలోనే అత్యధికంగా 45.6డిగ్రీల ఉష్ణోగ్రత నమోదు

జమ్మికుంట, ఏప్రిల్ 26: రాష్ట్రంలో అత్యధిక ఉష్ణోగ్రతలు జమ్మికుంటలో శుక్రవారం నమోదు అయ్యాయి. 45.6 డిగ్రీల ఉష్ణోగ్రతలతో నిప్పుల కొలిమిగా మారింది. ఉధయం 10 గంటల నుంచి ఉక్క పోతతో ప్రజలు ఉక్కిరి బిక్కిరి అయ్యారు. రాక పోకలు లేక మధ్యాహ్నం సమయంలో రహదారులన్ని నిర్మాను ష్యంగా మారాయి. అత్యవసరం అయితే తప్ప భయటకు వెళ్ల వద్దని అధికారులు సూచిస్తున్నారు.

బీజేపీవి మత రాజకీయాలు

- కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి రాజేందర్‌రావు
- రాహుల్ గాంధీ ప్రధాని కావాలంటే రాజేందర్‌రావును గెలిపించండి
- మంత్రి పొన్నం ప్రభాకర్



రాజన్న సిరిసిల్ల జిల్లా ఇల్లంతకుంటలో కాంగ్రెస్ అభ్యర్థి వెలిచాల రాజేందర్‌రావును సన్మానిస్తున్న నాయకులు

గన్నేరువరం, ఏప్రిల్ 26: బీజేపీ మత రాజకీయాలు చేస్తూ ప్రజల్లో వైషమ్యాలను సృష్టిస్తోందని కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి వెలిచాల రాజేందర్‌రావు విమర్శించారు. మండలంలోని గుండ్లపల్లి స్టేజీ వద్ద శుక్రవారం సాయంత్రం భారీ బహిరంగ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీని గెలిపించి రాహుల్ గాంధీని ప్రధానిని చేస్తే దేశంలోని మహిళలందరికీ సంవత్సరానికి లక్ష రూపాయలను అందజేస్తామన్నారు. అనంతరం మండ లంలోని వివిధ గ్రామాలకు చెందిన బీఆర్ఎస్ నాయకులు కాంగ్రెస్‌లో చేరారు. కార్యక్రమంలో డీసీసీ అధ్యక్షుడు, ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారా యణ, ఎంపీపీ లింగాల మల్లారెడ్డి, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ముస్కు ఉపేందర్‌రెడ్డి, రాష్ట్ర యూత్ కాంగ్రెస్ జాయింట్ సెక్రెటరీ అల్లూరి శ్రీనాథ్‌రెడ్డి, జిల్లా ఉపాధ్యక్షుడు కొమ్మెర రవీందర్‌రెడ్డి, నాయకులు బేతల్లి రాజేందర్ రెడ్డి, మాతంగి అనిల్, మార్గం మల్లేశం, తిప్పర్తి పరిపూర్ణచారి పాల్గొన్నారు.

● అభివృద్ధిని పట్టించుకోని వారికి గుణపాఠం చెప్పాలి

ఇల్లంతకుంట: అధికారంలో ఉన్నప్పుడు అభివృద్ధిని పట్టించుకోని నాయకులకు తగిన గుణపాఠం చెప్పాలని కాంగ్రెస్ పార్టీ ఎంపీ అభ్యర్థి వెలిచాల రాజేందర్‌రావు అన్నారు. రాజన్న సిరిసిల్ల జిల్లా ఇల్లంతకుంట మండలకేంద్రంలో శుక్రవారం రోడ్‌షో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎంపీలుగా పనిచేసిన వినోద్‌కుమార్, బండి సంజయ్‌కుమార్ ఏనాడూ ప్రజల బాగోగులు పట్టించుకోలేదన్నారు. దేవుడి పేరుతో ఓట్ల కోసం రాజకీయం చేస్తున్నారని విమర్శించారు.

● రాష్ట్రానికి చేసిందేమి లేదు: మంత్రి పొన్నం

సైదాపూర్: గడిచిన పది సంవత్సరాల్లో కేంద్రంలో బీజేపీ, రాష్ట్రంలో బీఆర్ఎస్ అధికారంలో ఉండి తెలంగాణ రాష్ట్రానికి చేసిందేమి లేదని రాష్ట్ర బీసీ సంక్షేమ, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ విమర్శించారు. శుక్రవారం ఆయన కరీంనగర్ పార్లమెంట్ నియోజక వర్గ కాంగ్రెస్ అభ్యర్థి వెలిచాల రాజేందర్‌రావుతో కలిసి మండల కేంద్రంలో ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా వెన్నెంపల్లి గాంధీ విగ్రహం నుంచి పాత బస్టాండ్ వరకు ర్యాలీ తీశారు. అనంతరం పాత బస్టాండ్ వద్ద ఏర్పాటు చేసిన కార్నర్ మీటింగ్‌లో మంత్రి మాట్లాడుతూ రాహుల్ గాంధీ ప్రధాని కావాలంటే ఈ నెల 13న జరిగే ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ చెయ్యి గుర్తుకు ఓటు వేసి రాజేందర్‌రావును అధిక మెజారిటీతో గెలింపించాలని కోరారు.

● ఎన్నికల్లో ఇచ్చిన హామీలను నిలబెట్టుకుంటాం..

చిగురుమామిడి: రాష్ట్రంలో ప్రజలకు ఇచ్చిన ప్రతి హామీని నిలబెట్టుకుంటామని మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో నిర్వహించిన రోడ్‌షోలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కేంద్రంతో కొట్లాడి మనకు రావాల్సిన నిధులు తీసుకు వచ్చే వ్యక్తి రాజేందర్‌రావు అన్నారు.

● ప్రతి ఊరికి కాలువల ద్వారా సాగునీరందిస్తా

కరీంనగర్ అర్బన్: కోహెడ మండలంలోని ప్రతి గ్రామానికి కాలువల ద్వారా సాగునీరందించే బాధ్యత తనదని మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. శుక్రవారం హుస్నాబాద్ అసెంబ్లీ నియోజకవర్గంలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కోహెడ మండలంలో భవిష్యత్‌లో రైతులకు సాగు నీరు, ఉద్యోగాలు తెస్తామన్నారు. కరీంనగర్ పార్లమెంట్ కాంగ్రెస్ అభ్యర్థి వెలిచాల రాజేందర్‌రావు మాట్లాడుతూ ప్రభాకరన్నను స్ఫూర్తిగా తీసుకుని ముందుకు సాగుతానని, ఎంపీగా అవకాశం ఇస్తే అందరికీ సేవ చేస్తానన్నారు.



చిగురుమామిడి కాంగ్రెస్ అభ్యర్థి వెలిచాల రాజేందర్‌రావు రోడ్ షోలో మాట్లాడుతున్న మంత్రి పొన్నం ప్రభాకర్



సైదాపూర్ కార్నర్ మీటింగ్‌లో మాట్లాడుతున్న మంత్రి పొన్నం ప్రభాకర్

బండి సంజయ్ చేసిందేమీ లేదు

- మోదీ రెండు కోట్ల ఉద్యోగాల భర్తీ ఏదీ
- ఎంపీగా గెలిపిస్తే పార్లమెంట్‌లో గళమెత్తుతా
- బీఆర్ఎస్ అభ్యర్థి బోయినపల్లి వినోద్‌కుమార్



గన్నేరువరం రోడ్ షోలో మాట్లాడుతున్న కరీంనగర్ బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి వినోద్‌కుమార్

కరీంనగర్ టౌన్, ఏప్రిల్ 26: ఐదేళ్లలో ఎంపీ బండి సంజయ్‌కుమార్ కరీంనగర్‌కు గానీ, పార్లమెంట్ నియోజక వర్గానికి, ప్రజలకు చేసిందేమి లేదని బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి బోయినపల్లి వినోద్‌కుమార్ విమర్శించారు. శుక్రవారం ఆయన స్థానిక అంబేద్కర్ స్టేడియంలో మాజీ మంత్రి, ఎమ్మెల్యే గంగుల కమలాకర్‌తో కలిసి మార్నింగ్ వాక్ చేస్తూ వాకర్స్‌ను కలిసి ఎంపీగా తనకు ఓటు వేసి గెలిపించాలన్నారు. పదేళ్లలో కేంద్రంలో అధికారంలో ఉన్న మోదీ ప్రభుత్వం ప్రజల ఆదాయం రెట్టింపు చేస్తామని, ఏడాదికి రెండు లక్షల చొప్పున రెండు కోట్ల ఉద్యోగాలిస్తామని ఇచ్చిన హామీలు ఏమయ్యాయని ప్రశ్నించారు. ఎంపీగా ఏమి చేశావో చెప్పమని బండి సంజయ్‌ని అడిగితే కేంద్ర పథకాల నుంచి నిధులు తెచ్చామని చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు జీవీ రామకృష్ణారావు, నగర అధ్యక్షుడు చల్ల హరిశంకర్, సివిల్ సప్లయిస్ కార్పొరేషన్ మాజీ ఛైర్మన్ రవీందర్‌సింగ్, కార్పొరేటర్లు తోట రాములు, అయిలేందర్‌యాదవ్, నాయకులు పాల్గొన్నారు.

● కాంగ్రెస్, బీజేపీకి ఓటేసే పరిస్థితి లేదు

కాంగ్రెస్, బీజేపీలకు రైతులు వ్యతిరేకంగా మారడంతో ఆ రెండు పార్టీ అభ్యర్థులకు ఓటు వేసే పరిస్థితి లేదని మాజీ మంత్రి, ఎమ్మెల్యే గంగుల కమలాకర్ అన్నారు. శుక్రవారం ఎమ్మెల్యే గంగుల కమలాకర్ నివాసంలో కొత్తపల్లి, కరీంనగర్ రూరల్ మండలాల బీఆర్ఎస్ ప్రజాప్రతినిధులు, నాయకులతో ఎమ్మెల్యే గంగుల కమలాకర్, బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి బోయినపల్లి వినోద్‌కుమార్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గంగుల కమలాకర్ మాట్లాడుతూ పార్లమెంట్‌లో ప్రశ్నించే గొంతుక ఉండాలని, వినోద్‌కుమార్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలన్నా రు. ఎమ్మెల్యే, ఎంపీ ఒకే పార్టీ వారైతే అభివృద్ధి నిరంతరం కొనసాగుతుందన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు జీవీ రామకృష్ణారావు, ఎంపీపీలు తిప్పర్తి లక్ష్మయ్య, పిల్లి శ్రీలతమహేశ్, తోట తిరుపతి, కేరంనగర్, కొత్తపల్లి మండలాల అధ్యక్షుడు పెండ్యాల శ్యాంసుందర్‌రెడ్డి, కాసారపు శ్రీనివాస్‌గౌడ్, మాజీ ఎఎంసీ ఛైర్మన్ రెడ్డివేణి మధు, కో ఆప్షన్ సభ్యుడు సాబీర్ పాషా, వైస్ఎంపీపీ తిరుపతి నాయక్, సుంకిశాల సంపత్‌రావు పాల్గొన్నారు.

● కాంగ్రెస్‌కు ఓటేసి కయ్యిలో పడొద్దు...

కరీంనగర్ టౌన్/గన్నేరువరం: కాంగ్రెస్‌కు ఓటేసి కయ్యిలో పడొద్దని, బీజేపీకి ఓటు వేసి మోసపోవద్దని బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి బోయినపల్లి వినోద్‌కుమార్ అన్నారు. శుక్రవారం గన్నేరువరం మండల కేంద్రంలో నిర్వహించిన రోడ్‌షోలో ప్రజలనుద్దేశించి వినోద్‌కుమార్ ప్రసంగించారు. బండి సంజయ్‌కి అభివృద్ధి చేయడం చేతగాక పూటకో మాట, రోజుకో వేషం వేస్తున్నాడని ఎద్దేవా చేశారు. బండి సంజయ్ అసమర్థత కారణంగానే కరీంనగర్‌కు వచ్చిన ట్రిపుల్ ఐటీని కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ఇతర రాష్ట్రాలకు తరలించిందని విమర్శించారు. ఐదేళ్లలో సంజయ్ జడ్పీ మీటింగ్‌కు కూడా హాజరుకాలేదన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం యాసంగి పంటకు క్వింటాల్‌కు 500 బోనస్ ఇస్తామని, ఇప్పుడు ఇవ్వకుండా దాటవేసే ధోరణితో రైతులను మోసం చేసిందని విమర్శించారు. రెండు లక్షల రుణమాఫీ ఏమైందని ప్రశ్నించారు. తాను ఎంపీగా ఉన్నపుడు గన్నేరువరం మండల కేంద్రాన్ని దత్తత తీసుకొని అభివృద్ధి చేశానని, గన్నేరువరం గ్రామాన్ని మండల కేంద్రంగా ఏర్పాటు చేశానని గుర్తుచేశారు. కార్యక్రమంలో టెస్కాబ్ ఛైర్మన్ కొండూరు రవీందర్‌రావు, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు జీవీ రామకృష్ణారావు, జడ్పీ మాజీ ఛైర్‌పర్సన్ తుల ఉమ, జడ్పీటీసీ రవీందర్‌రెడ్డి, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు గంప వెంకన్న, వైఎస్ ఎంపీపీ స్వప్న సుధాకర్, రెడ్డవేని తిరుపతి, గడ్డం నాగరాజు, మాజీ సర్పంచు లక్ష్మి లక్ష్మణ్ పాల్గొన్నారు.



కరీంనగర్ సమావేశంలో మాట్లాడుతున్న కరీంనగర్ బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి వినోద్‌కుమార్



వాకర్స్‌కు కరపత్రాన్ని అందిస్తూ ఓట్లను అభ్యర్థిస్తున్న వినోద్‌కుమార్

పక్కాగా పోలింగ్ సిబ్బంది సెకండ్ ర్యాండమైజేషన్ : కలెక్టర్

కరీంనగర్ టౌన్, ఏప్రిల్ 26: పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో పోలింగ్ సిబ్బంది సెకండ్ ర్యాండమైజేషన్ పక్కాగా నిర్వహించినట్లు ఎన్నికల రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ పమేలా సత్పతి తెలిపారు. శుక్రవారం సాయంత్రం కలెక్టరేట్ సమావేశ మందిరంలో పోలింగ్ సిబ్బంది సెకండ్ ర్యాండమైజేషన్ ప్రక్రియను కలెక్టర్ ఆధ్వర్యంలో ప్రత్యేక సాఫ్ట్‌వేర్ ద్వారా నిర్వహించారు. ఈ ప్రక్రియను కరీంనగర్ పార్లమెంట్ ఎన్నికల సాధారణ పరిశీలకుడు అమిత్ కటారియా పర్యవేక్షించారు. కార్యక్రమంలో రాజన్న సిరిసిల్ల జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి, కరీంనగర్, సిరిసిల్ల జిల్లాల అదనపు కలెక్టర్లు ప్రఫుల్ దేశాయ్, పూజారి గౌతమి, ట్రైనీ కలెక్టర్ అజయ్ యాదవ్, డీఆర్వో పవన్‌కుమార్, సీపీవో కొమురయ్య, డీఐవో శివరాములు, పలువురు అధికారులు పాల్గొన్నారు

నామినేషన్ల పరిశీలన పూర్తి

● 20 మంది అభ్యర్థుల నామినేషన్ల తిరస్కరణ

కరీంనగర్, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): కరీంనగర్ పార్లమెంట్ ఎన్నికల అభ్యర్థుల నామినేషన్ల పరిశీలన ప్రక్రియ శుక్రవారం పూర్తయింది. కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాలులో అభ్యర్థులు, వారి తరపున



కలెక్టరేట్‌కాన్ఫరెన్స్ హాలులో నామినేషన్లను పరిశీలిస్తున్న ఎన్నికల అధికారి, జిల్లాకలెక్టర్ పమేలా సత్పతి

హాజరైన ప్రజాప్రతినిధుల సమక్షంలో కరీంనగర్ పార్లమెంట్ ఎన్నికల సాధారణ పరిశీలకులు ఐఏఎస్ అధికారి అమిత్‌కటారియా పర్యవేక్షణలో ఎన్నికల రిటర్నింగ్ అధికారి, జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి నామినేషన్ పత్రాలను క్షుణ్ణంగా పరిశీ లించారు. కరీంనగర్ పార్లమెంట్ స్థానానికి 53 మంది అభ్యర్థులు దాఖలు చేసిన 94 నామినేషన్లను పరిశీలించారు. లోపాలున్న, సరిగా వివరాలు సమర్పించని 20 మంది నామినేషన్లను తిరస్కరించినట్లు కలెక్టర్ వెల్లడించారు. 33 మంది అభ్యర్థుల నామినేషన్లను ఆమోదించినట్లు తెలిపారు. తిరస్కరణఖు గురైన అభ్యర్థుల సెక్యూరిటీ డిపాజిట్‌ను తిరిగి ఇస్తామని, నామినేషన్ ఎందుకు తిరస్కరణకు గురైందో వివరాలు అభ్యర్థులకు తెలియజేస్తామన్నారు.

● 29వ తేదీ 3 గంటల వరకు ఉపసంహరణకు గడువు

కరీంనగర్ పార్లమెంట్‌స్థానానికి నామినేషన్ల ఉపసంహరణకు 29వ తేదీ 3 గంటల వరకు అవకాశం ఉందని ఎన్నికల అధికారి పమేలా సత్పతి తెలిపారు. ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు శని, ఆదివారాలు సెలవులు ఉంటాయన్నారు. సోమవారం ఉదయం నుంచి మధ్యాహ్నం మూడు గంటల్లోగా నామినేషన్లను అభ్యర్థులు ఉపసంహరించుకోవచ్చన్నారు. సెలవు రోజుల్లో ఉపసంహరణకు అవకాశం ఉండదని, అభ్యర్థులు గమనించాలన్నారు. 29వ తేదీ మూడు గంటలవరకు మాత్రమే అవకాశం ఉంటుందని సమయం తర్వాత వచ్చి ఇబ్బందులు పడవద్దని సూచించారు. సమావేశంలో అదనపు కలెక్టర్లు ప్రఫుల్ దేశాయ్, లక్ష్మీకిరణ్, రాజన్న సిరిసిల్ల అదనపు కలెక్టర్ పూజారి గౌతమి, ట్రైని కలెక్టర్ అజయ్‌యాదవ్, ఆర్డీవోలు మహేశ్వర్, రమేష్‌బాబు, అధికారులు, అభ్యర్థులు, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

భారతీయుల ఆత్మ.. బీజేపీ

- కాంగ్రెస్, బీఆర్ఎస్ అంబేద్కర్‌ను అవమానించాయి
- ఎంపీ, బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి బండి సంజయ్‌కుమార్



మానకొండూర్‌లో అంబేద్కర్ చిత్రపటానికి నమస్కరిస్తున్న ఎంపీ బండి సంజయ్‌కుమార్

మానకొండూర్, ఏప్రిల్ 26: బీజేపీ అంటే భారతీయుల ఆత్మ అని ఎంపీ, ఆ పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి బండి సంజయ్‌కుమార్ అన్నారు. మానకొండూర్‌లో బీజేపీ ఆధ్వర్యంలో దళిత సమ్మేళనం శుక్రవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరైన బండి సంజయ్ మాట్లాడుతూ నరేంద్రమోదీ ఆధ్వర్యంలోని బీజేపీ ప్రభుత్వం దళితుల అభ్యున్నతి కోసం నిరంతరం పాటుపడుతున్నదన్నారు. అంబేద్కర్‌ను కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలు అవమానించాయని, అలాంటి పార్టీలకు దళితులు తగిన గుణపాఠం చెప్పాలని ఆయన పిలుపునిచ్చారు. బీజేపీ పేరులోనే భారతీయత ఉందని, ఈ పార్టీని ఈ దేశ ముద్దు బిడ్డలయిన అటల్ బిహారీ వాజ్‌పేయ్, ఎల్‌కే అద్వాని స్థాపించారని తెలిపారు. కాంగ్రెస్ పార్టీలో భారతీయత ఎక్కడుందని ప్రశ్నించారు. కాంగ్రెస్ పార్టీ పొరపాటున అధికారంలోకి వస్తే పేదలు సహా ఎవ్వరు చనిపోయినా వారి ఆస్తిలో 55 శాతం గుంజుకుంటుందని హెచ్చరించారు. ఇదే విషయాన్నికాంగ్రెస్ పార్టీ విదేశాంగ విభాగం ఇన్‌చార్జి శ్యాంపిట్రోడా స్పష్టం చేశారని ఆయన తెలిపారు. బీఆర్ఎస్ ప్రభుత్వం పదేళ్లలో యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించకుండా వారిని నడి రోడ్డున పడేసిందని విమర్శించారు. పరాయోడు మోసం చేస్తే పొలిమేర దాకా తరిమికొట్టమని, సొంతోడు మోసం చేస్తే పాతపెట్టమని ప్రజాకవి కాళోజీ అన్నారని, తెలంగాణను దోచుకున్న ఆంధ్రా పాలకులను తరిమి కొట్టి పొలిమేర దాటించినమని, ఇగ బీఆర్ఎస్‌ను పాతరేసే టైమొచ్చిందన్నారు. జూన్ 4న ఆ పార్టీని గొయ్యి తీసి వెయ్యి అడుగుల లోతున పాతరేసేందుకు నాలుగు కోట్ల తెలంగాణ ప్రజలు సిద్ధమయ్యారన్నారు. కరీంనగర్ నుంచి పోటీ చేస్తున్న బీఆర్ఎస్, కాంగ్రెస్ అభ్యర్థులు ఎన్నడైనా మీ వద్దకు వచ్చారా? మీ కోసం ఎన్నడైనా పోరాడారా అని ప్రశ్నించారు. తాను ప్రజల కోసం చేసిన పోరాటాలేమిటో... వాళ్లు చేసిన పోరాటాలేమిటో బేరీజు వేసుకుని ఓటేయండని కోరారు. తనను ఓడించేందుకు ఆ రెండు పార్టీలు ఒక్కటయ్యాయని, కేసీఆర్ కూడా ఐదు రోజులు కరీంనగర్‌కు వచ్చి తనను ఓడగొట్టడానికి కుట్ర చేస్తున్నాడన్నారు. కార్యక్రమంలో దళితమోర్చా రాష్ట్ర అధ్యక్షుడు కొండేటి శ్రీధర్, జాతీయ కార్యవర్గ సభ్యుడు ఎస్ కుమార్, మాజీ అధ్యక్షుడు కొప్పు భాషా, బీజేపీ జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి, కుమ్మరి శంకర్, జిల్లా ఉపాధ్యక్షుడు వెంకటరెడ్డి, రంగు బాస్కరాచారి, మండల అధ్యక్షుడు ప్రవీణ్ పాల్గొన్నారు.

● బీజేపీలో భారీగా చేరికలు

భగత్‌నగర్: కాంగ్రెస్, బీఆర్ఎస్ అభ్యర్థులకు ఆ పార్టీల కార్యకర్తలే ఓటు వేసే పరిస్థితి లేదని బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, కరీంనగర్ పార్లమెంట్ బీజేపీ అభ్యర్థి బండి సంజయ్‌కుమార్ అన్నారు. శుక్రవారం నగరంలోని ఎంపీ కార్యాలయంలో మానకొండూర్, చొప్పదండి నియోజకవర్గాలకు చెందిన పలువురు బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీల నాయకులు బీజేపీలో చేరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కరీంనగర్ నియోజకవర్గ ప్రజలకు కాంగ్రెస్ అభ్యర్థి ఎవరో తెలియదన్నారు. అటువంటి వ్యక్తికి ఎలా ఓటేస్తారని ప్రశ్నించారు.

● కమలాపూర్ సీతారామచంద్రస్వామిని దర్శించుకున్న బండి సంజయ్

కమలాపూర్ బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, కరీంనగర్ బీజేపీ ఎంపీ అభ్యర్థి బండి సంజయ్‌కుమార్ శుక్రవారం రాత్రి హుజూరాబాద్ నియోజక వర్గంలోని కమలాపూర్‌లోని శ్రీసీతారామచంద్రస్వామి రథోత్సవంలో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన ఆలయంలో పూజలు నిర్వహించారు. రథాన్ని స్వయంగా లాగుతూ భక్తుల్లో ఉత్సాహాన్ని నింపారు.



కరీంనగర్‌లో కాషాయ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న బండి సంజయ్‌కుమార్



కమలాపూర్ శ్రీసీతారామచంద్రస్వామిని దర్శించుకుంటున్న బండి సంజయ్‌కుమార్

కరీంనగర్‌లో పోలీసుల విస్తృత తనిఖీలు



బస్ స్టాండ్‌లో తనిఖీలు చేస్తున్న పోలీసులు

కరీంనగర్ క్రైం, ఏప్రిల్ 26: కరీంనగర్ బస్‌స్టాండ్, రైల్వేస్టేషన్లలో వాహన తనిఖీలు ఇతర రద్దీ ప్రదేశాల్లో పలుచోట్ల ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఎన్నికలు ముగిసే వరకు ఈ ఆకస్మిక తనిఖీలు నిర్వహిస్తామని సీపీ అభిషేక్ మొహంతి తెలిపారు. అన్ని వర్గాల ప్రజలు ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున నియమావళికి అనుగుణంగా నడుచుకోవాలని కోరారు. ఎన్నికల నియమావళి ఉల్లంఘనకు పాల్పడితే చట్ట ప్రకారం చర్యలు చేపడతామన్నారు.





భార్య హత్య కేసులో భర్తకు జీవిత ఖైదు

కరీంనగర్ లీగల్, ఏప్రిల్ 26: ప్రేమించి పెళ్లి చేసుకున్న భార్యను తాగుడుకు బానిసై ఆమెను రోకలిబండతో కొట్టి హత్య చేసిన నేరంలో నిందితుడు భర్తకు జీవిత ఖైదుతోపాటు 2000 రూపాయల జరిమానా విధిస్తూ జిల్లా జడ్జి బి ప్రతిమ శుక్రవారం తీర్పునిచ్చారు. ప్రాసిక్యూషన్ కథనం ప్రకారం.. ఆదిలాబాద్ జిల్లా భీముని మండలం వాడ్ల గ్రామానికి చెందిన డోకా బక్కయ్య కూతురు వసంతను మహారాష్ట్రకు చెందిన వ్యక్తితో వివాహం జరిపించారు. ఏడాదిన్నర తర్వాత బక్కయ్య ఇంటిముందు గల మహ్మద్ సాబీర్ (30) వసంతతో ఉన్న పరిచయంతో ఆమెకు మాయమాటలు చెప్పి తీసుకొని వెళ్లి వివాహం చేసుకున్నాడు. ఈ సంఘటన తర్వాత బక్కయ్య తన కుటుంబంతో సహా బతుకుదెరువు కోసం చొప్పదండి మండలం మంగళ్ళపల్లికి వచ్చి జీవిస్తున్నాడు. వసంతకు కూడా ఆర్థిక ఇబ్బందులు రావడంతో కుటుంబంతో సహా తండ్రి వద్దకు వచ్చి వారితో కలిసి జీవిస్తున్నది. వసంత భర్త సాబీర్ తాగుడుకు బానిసై 2017 అక్టోబర్ 13న రాత్రి తాగివచ్చి భార్యతో గొడవపడి ఆమెను రోకలిబండతో తీవ్రంగా గాయపరచడంతో ఆమె ఆసుపత్రిలో చికిత్స పొందుతూ చనిపోయింది. ఈ సంఘటనపై బక్కయ్య చొప్పదండి పోలీసులకు ఫిర్యాదు చేయగా పోలీసులు సాబీర్‌పై హత్యానేరం కేసు నమోదు చేయగా అప్పటి సీఐ లక్ష్మీబాబు కేసు దర్యాప్తు జరిపి చార్జిషీట్ దాఖలు చేశారు. ఈ కేసులో సాక్షులను పబ్లిక్ ప్రాసిక్యూటర్ వింజమూరి వెంకటేశ్వర్లు కోర్టులో ప్రవేశపెట్టి వాదించారు. సాక్ష్యాధారాలను పరిశీలించిన జడ్జి నిందితుడు సాబీర్‌కు జీవితఖైదు విధిస్తూ తీర్పునిచ్చారు.

చికిత్స పొందుతూ వృద్ధురాలి మృతి


తిమ్మాపూర్, ఏప్రిల్ 26: మండలంలోని మన్నెంపల్లి గ్రామంలో మోతె మల్లమ్మ(75) అనే వృద్ధురాలు చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. మోతె మల్లమ్మ(75)గురువారం ఉదయం ఇంటి ముందు శుభ్రం చేస్తున్న క్రమంలో ఆమె కుడిచేయిపై గుర్తు తెలియని విష పురుగు కుట్టింది. కుటుంబ సభ్యులు వెంటనే కరీంనగర్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి మల్లమ్మ మరణించింది. మల్లమ్మ కుమారుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

భూమి ఫోర్జరీ కేసులో ఇద్దరి అరెస్టు

వీణవంక, ఏప్రిల్ 26: మండలంలోని మల్లారెడ్డిపల్లిలో 2.26 ఎకరాల వ్యవసాయ భూమిని ఫోర్జరీ చేసి ఇతరులకు విక్రయించిన కేసులో శుక్రవారం పోలీసులు ఇద్దరిని అరెస్టు చేశారు. ఎస్సై తిరుపతి తెలిపిన వివరాల ప్రకారం.. మల్లారెడ్డిపల్లికి చెందిన దూలం రాజయ్య తన 2.26 ఎకరాల వ్యవసాయ భూమిని అవసరం నిమిత్తం గ్రామానికి చెందిన మేకల మోహన్‌రెడ్డికి 1.13, కొలిపాక రామస్వామికి 1.13 ఎకరాలు విక్రయించారు. ఈ భూమిని వారి పేరిట రిజిస్ట్రేషన్ చేశాడు. భూమి విక్రయం రాజయ్య మేనల్లుడు బొంగోని స్వామికి ఇష్టం లేక పోవడంతో అతడు రెవెన్యూ కార్యాలయ సిబ్బందితో ఒప్పందం చేసుకుని తన పేరిట రిజిస్ట్రేషన్ చేయించుకున్నాడు. దీనికి గతంలో పని చేసిన డిప్యూటీ తహసీల్దార్ శ్రీనివాస్‌రెడ్డి, ధరణి ఆపరేటర్ అరుణ్ చౌదరి సహకరించారు. ఈ మేరకు వారికి స్వామి రెండు లక్షల రూపాయలు ముట్టజెప్పేందుకు ఒప్పందం చేసుకు న్నాడు. పథకం ప్రకారం మోహన్‌రెడ్డి, కొలిపాక రామస్వామికి రిజిస్ట్రేషన్ ఒరిజినల్ పత్రాలు సిబ్బంది ఇవ్వలేదు. భూమి హక్కు పత్రాల కోసం కార్యాలయం చుట్టూ తిరుగుతున్న వారిని వేలి ముద్రలు వేస్తేనే ఒరిజనల్ పత్రాలు వస్తాయని ధరణి ఆపరేటర్ నమ్మించాడు. వారి అతడి మాటను విశ్వసించి వేలిముద్రలు వేశారు. దీంతో వారి పేరు మీద ఉన్న భూమి బొంగోని స్వామికి విక్రయించినట్లు పత్రాలు తయారు చేసి అందజేశారు. కబ్జాల్లో మోహన్‌రెడ్డి, రామస్వామి ఉన్నప్పటికీ హక్కు పత్రాలు స్వామి పేరిట ఉన్న విషయం తెలియడంతో బాధిత రైతులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు ఇద్దరు నిందితులు స్వామితో పాటు అరుణ్ చౌదరిని అరెస్టు చేశామని, ఈ కేసుతో సంబంధం ఉన్న మరో వ్యక్తి పరారీలో ఉన్నాడని ఎస్సై తిరుపతి తెలిపారు. కేసు దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.













డిప్లొమా కోర్సులో చేరికకు దరఖాస్తుల ఆహ్వానం

కరీంనగర్ టౌన్, ఏప్రిల్ 26: కేంద్ర జౌళి మంత్రిత్వశాఖకు సంబంధించిన ఒరిస్సా రాష్ట్రంలోని ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ హ్యాండ్లూమ్ టెక్నాలజీ, బార్గా కళాశాలలో మూడు సంవత్సరాల డిప్లొమా ఇన్ హ్యాండ్లూం, టెక్స్‌టైల్ టెక్నాలజీ కోర్సులో చేరేందుకు ఆసక్తిగల విద్యార్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్న ట్లు చేనేత జౌళిశాఖ సహాయ సంచాలకుడు ఎస్ చరణ్ ఒక ప్రకటనలో తెలిపారు. పదో తరగతి పాసై జూలై 16, 2024 నాటికి జనరల్ కేటగిరిలో 15 నుంచి 23 సంవత్సరాలు, ఎస్సీ, ఎస్టీ కేటగిరీలలో 15 నుంచి 25 సంవత్సరాలు నిండిన వారు అర్హులని, ఈ కళాశాలలో తెలంగాణ రాష్ట్రానికి తొమ్మిది సీట్లు కేటాయించారని తెలిపారు. ఔత్సాహిక విద్యార్థులు జూన్ 10, 2024లోగా వారి దరఖాస్తులను నిర్ణీత ప్రొఫార్మాలో నెల్లూరు జిల్లాలోని ప్రిన్సిపాల్, ఎస్‌పీకేఎం ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ హ్యాండ్లూమ్ టెక్నాలజీ వెంకటగిరి చిరునామాకుగానీ, కరీంనగర్ మంకమ్మతోటలోని సహాయ సంచాలకుడు చేనేత, జౌళిశాఖ కార్యాలయంలో గానీ సమర్పించవచ్చని తెలిపారు. విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

అనారోగ్యంతో బావిలో దూకి వివాహిత ఆత్మహత్య

తిమ్మాపూర్, ఏప్రిల్ 26: కరీంనగర్ కార్పొరేషన్ పరిధిలో గల 8వ డివిజన్ అలుగు నూర్‌లో అనారోగ్య సమస్యలతో మనస్తాపం చెంది శుక్రవారం ఓ వ్యవసాయ బావిలో దూకి ఆత్మహత్య చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. అలుగునూర్‌కి చెందిన పున్నం సత్తమ్మ(51) రెండేళ్లుగా అనారోగ్యంతో బాధపడుతోంది. చికిత్స కోసం ఆస్పత్రులకు వెళితే డబ్బులు ఖర్చు అవుతున్నా నయం కావడం లేదని మనస్తాపం చెందింది. శుక్రవారం తెల్లవారు జామున 5గంటలకు సత్తమ్మ వాకింగ్‌కు వెళ్తున్నానని ఇంట్లో చెప్పి బయటకు వెళ్లి తిరిగి ఇంటికి రాలేదు. సత్తమ్మ భర్త శ్రీనివాస్, కుమారుడు హరిష్ ఆమె కోసం గాలి స్తుండగా కొద్ది దూరంలో ఉన్న ఓ వ్యవసాయ బావి వద్ద సత్తమ్మ చెప్పులు గమనించారు. బావిలోకి చూడగా సత్తమ్మ మృత దేహం కనిపించింది. సత్తమ్మ అన్న ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై చేరాలు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి

మెట్‌పల్లి రూరల్, ఏప్రిల్, 26: మండలంలోని వెల్లుల్ల గ్రామంలోని వెటర్నరీ ఆసుపత్రిలోని అటెండర్ ముద్దం గంగాధర్(42) శుక్రవారం రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. పోలీసులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం..మదం గంగాధర్ పనుల నిమిత్తం మెట్‌పల్లి పట్టణానికి వెళ్తున్న క్రమంలో వెల్లుల్ల గ్రామ శివారులోని వీఆర్ఎమ్ గార్డెన్ సమీపంలో ఎదురుగా వస్తున్న ఆటో ఢీకొట్టడంతో తలకు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు గమనించి మెట్‌పల్లి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. వైద్యులు పరిశీలించి మృతి చెందినట్లు తెలిపారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.



స్వామివారిని దర్శించుకుంటున్న భక్తులు

రాజన్న క్షేత్రంలో భక్తుల రద్దీ



కోడె మొక్కు చెల్లించుకుంటున్న భక్తులు

వేములవాడ, ఏప్రిల్ 26: వేములవాడ రాజరాజేశ్వర స్వామివారి దేవస్థానం శుక్రవారం భక్తులతో రద్దీగా మారింది. వివిధ ప్రాంతాల నుండి తరలివచ్చిన భక్తులు తమ ఇష్ట దైవమైన శ్రీ రాజరాజేశ్వర స్వామి వారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకొని తరించారు. తొలుత ఆలయ కళ్యాణ కట్టలో తలనీలాలు సమర్పించి, ధర్మగుండంలో పవిత్ర స్నానాలు ఆచరించారు. అనంతరం సర్వదర్శనం, ప్రత్యేక దర్శనం క్యూలైన్ల మీదుగా ఆలయంలోకి ప్రవేశించి శ్రీ రాజరాజేశ్వర స్వామివారిని దర్శించుకున్నారు. కళాభవన్‌లో శ్రీ స్వామివారి నిత్య కళ్యాణం, సత్యనారాయణ వ్రతం, బాలాత్రిపుర సుందరి దేవి ఆలయంలో కుంకుమ పూజ తది తర ఆర్జిత సేవలలో పాల్గొన్నారు. శ్రీ స్వామివారికి ప్రీతిపాత్రమైన కోడెమొ క్కును పెద్ద సంఖ్యలో భక్తులు చెల్లించుకున్నారు. అనుబంధా లయమైన బద్దిపోచమ్మ దేవాలయం సైతం భక్తులతో క్రిక్కిరిసిపోయింది. వందలాది మంది భక్తులు బద్దిపోచమ్మవారిని దర్శించుకుని బోనం మొక్కు చెల్లించుకున్నారు. భక్తులకు ఇబ్బందులు కలగకుండా ఆలయ అధికారులు తగిన ఏర్పాట్లు చేశారు.

శ్రీలంక అమ్మాయి.. తెలంగాణ అబ్బాయి

- ఎల్లలు దాటిన ప్రేమ.. పెళ్లితో ఒక్కటయ్యారు..

రాయికల్/మెట్‌పల్లి రూరల్, ఏప్రిల్ 26: జగిత్యాల జిల్లా రాయికల్ మండంలోని భూపతిపూర్‌లో శ్రీలంక అమ్మాయి.. తెలంగాణ అబ్బాయి శుక్రవారం ప్రేమ పెళ్లి చేసుకుని ఒక్కటయ్యారు. శ్రీలంక దేశానికి చెందిన మరియక్రిష్టియన్ జోర్డాన్ దేశంలో ఓ కంపెనీలో ఉద్యోగం చేస్తోంది. తెలంగాణ రాష్ట్రంలోని మెట్‌పల్లి మండలం మూడు బొమ్మల మేడిపల్లికి చెందిన జోగిడె అశోక్ ఇదే కంపెనీలో పని చేస్తున్నాడు. మూడేళ్ల పాటు ఒకే కంపెనీలో పని చేయడంతో వీరిద్దరి మధ్య ప్రేమ చిగురించింది. ఇరువైపు లా కుటుంబసభ్యులకు తమ ప్రేమ విషయం చెప్పారు. కుటుంబసభ్యుల అంగీకారంతో పెళ్లి చేసుకోవాలని నిర్ణయించకున్నారు. ఇటీవల అశోక్ తన ప్రేమికురాలు మరియతో స్వగ్రామానికి చేరుకున్నారు. అశోక్‌కు తల్లిదండ్రులు లేకపోవడంతో రాయికల్ మండలం రామాజీపేట గ్రామానికి చెందిన తన సోదరి ఇంటికి వచ్చి శుక్రవారం పెళ్లి ముహూర్తం పెట్టుకున్నారు. రామోజీపేట మండలంలోని భూపతిపూర్ లక్ష్మీ నృసింహస్వామి ఆలయంలో కుటుంబసభ్యులు, బంధువుల మధ్య హిందూ సాంప్రదాయం ప్రకారం వివాహం జరిపించారు.



పెళ్లి చేసుకుంటున్న శ్రీలంక అమ్మాయి-తెలంగాణ అబ్బాయి

రోడ్డు ప్రమాదంలో రిటైర్డు ఉద్యోగి మృతి

ముస్తాబాద్, ఏప్రిల్ 26 : ముస్తాబాద్ మండలం సిద్దిపేట దారిలో జరిగిన రోడ్డు ప్రమాదంలో విశ్రాంత ఉద్యోగి మృతి చెందారు. ముస్తాబాద్ పట్టణానికి చెందిన అబ్రమేని సాయిలు ముస్తాబాద్ వైపు నుంచి సిద్దిపేట ద్విచక్రవాహనంపై వెళ్తున్నాడు. సిద్దిపేట వైపు నుంచి అతివేగంగా వచ్చిన కారు ఢీకొట్టింది. ద్విచక్రవాహనంతో పాటు సాయిలును రోడ్డు మీద నుంచి పక్కన ఉన్న గుంతవైపు కొంత దూరం ఈడ్చుకెళ్లింది. ద్విచక్ర వాహనం, కారు ముందు భాగం నుజ్జునుజ్జు అయ్యాయి. సా యిలుకు తీవ్రమైన గాయాలు కావడంతో సిద్దిపేట జిల్లా కేంద్రంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమం కావడంతో మరణించినట్లు వైద్యులు తెలిపారు. సాయిలుకు భార్య పరమేశ్వరి, కూతుళ్ల వెన్నెల, అర్చన ఉన్నారు. కుటుంబ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. బాధిత కుటుంబానికి న్యాయం చేయాలని సంఘం అధ్యక్షుడు పుల్లూరి రవి, మాజీ ఎంపీటీసీ గజ్జెల రాజు, పిట్ల విఠల్, రంజాని రాజలింగం సామాజిక వర్గ సభ్యులు డిమాండ్ చేశారు. కారు అతివేగమే ప్రమాదానికి కారణమని స్థానికులు తెలిపారు.



సాయిలు(ఫైల్)

కొడుకును రోకలిబండతో బాది హత్య చేసిన తండ్రి

- ఠాణాలో లొంగిపోయిన నిందితుడు శ్రీనివాస్ - ఆన్‌లైన్ గేమ్స్, అప్పులే హత్యకు కారణం

కరీంనగర్ క్రైం, ఏప్రిల్ 26: ఆన్‌లైన్ గేమ్స్‌తో డబ్బులు పోగొట్టుకుని లక్షల రూపాయలు అప్పుచేస్తున్న కొడుకును తండ్రి వారించాడు. అయినా వినకుండా హైదరాబాద్‌లో ప్రైవేట్ ఉద్యోగం చేస్తున్నానని చెబుతూ స్నేహితులతో జల్సాలు చేస్తూ, ఆన్‌లైన్ గేమ్స్ ఆడుతూ స్థాయికి మించి 15 లక్షల వరకు అప్పులు చేశాడు. ఈ అప్పులు తీర్చేందుకు వారికి ఉన్న మూడు గుంటల భూమిని విక్రయించాలని కొడుకు తన తండ్రిపై తీవ్ర ఒత్తిడి తెస్తున్నాడు. ఒక దశలో భూమిని అమ్మకుంటే చంపుతానని తండ్రిని బెదిరించాడు. దీంతో కొడుకు తనను ఎలాగైనా హత్య చేస్తాడని భయంతో కొడుకు ఇంటిలో ఉన్నప్పుడు ఇంటికి రాకుండా బయటనే గడిపాడు. తనను చంపక ముందే తనే కొడుకును చంపాలని నిర్ణయించుకుని అమలు చేశాడు. కరీంనగర్ రూరల్ సీఐ ఏ ప్రదీప్‌కుమార్, మృతుడి బంధువుల వివరాల ప్రకారం.... కొత్తపల్లి మండలం చింతకుంటగ్రామానికి చెందిన పెరుమాండ్ల శివసాయి(21) హైదరాబాద్‌లో ఉద్యోగం చేస్తున్నానని చెబుతూ ఎలాంటి పనిచేయకుండా ఆన్‌లైన్ గేమ్స్ ఆడుతూ స్నేహితులతో జల్సాగా తిరుగుతూ 15 లక్షల వరకు అప్పుచేశాడు. ఈ అప్పులు తీర్చేందుకు ఉన్న మూడు గుంటల భూమిని విక్రయించాలని ఆరు నెలలుగా తండ్రి శ్రీనివాస్‌పై తీవ్రఒత్తిడి తీసుకువస్తున్నాడు. జల్సాలకు అలవాటైన కొడుకు పద్దతి మార్చుకోవాలని ఎంత నచ్చజెప్పినా వినలేదు. భూమి విక్రయించకుంటే చంపుతానని శివసాయి తన తండ్రిని బెదిరిస్తున్నాడు. ఈక్రమంలో తనను కొడుకు చంపుతాడని అనుమానించిన శ్రీనివాస్... కొడుకు ఇంటికి వచ్చిన సమయంలో భయంతో బయటకు వెళుతున్నాడు. ఎలాగైనా కొడుకును చంపాలని నిర్ణయించుకున్న తండ్రి శ్రీనివాస్ ఐదు నెలలుగా సమయం కోసం ఎదురుచూస్తున్నాడు. శుక్రవారం ఉదయం 10గంటలకు ఇంట్లో ఎవరూలేని సమయంలో మంచంపై నిద్రిస్తున్న కొడుకు పెరుమాండ్ల శివసాయి తల, ముఖంపై రోకలిబండతో కొట్టాడు. తప్పించుకునే ప్రయత్నం చేయటంతో అప్పటికే సిద్ధం చేసుకున్న కారంపొడిని కళ్లల్లో చల్లాడు. ఆ వెంటనే రోకలిబండతో మరో నాలుగుసార్లు తలపై కొట్టగా తల పగిలి తీవ్ర రక్తస్రావంతో అక్కడికక్కడే మృతి చెందాడు. కొడుకును చంపిన తరువాత నిందితుడు శ్రీనివాస్ డయల్ 100 కాల్ చేసి కొత్తపల్లి పోలీసులకు లొంగిపోయినట్లు సమాచారం. మృతుడి తండ్రి శ్రీనివాస్ మున్సిపాలిటీలో కాంటాక్టు ట్రాక్టర్ డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. సంఘటనా స్థలాన్ని కరీంనగర్ రూరల్ సీఐ ప్రదీప్‌కుమార్ పరిశీలించి, విచారణ జరిపారు. మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదుతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని సీఐ తెలిపారు.



శివసాయి(ఫైల్)

తనిఖీల్లో నగదు పట్టివేత

చందుర్తి, ఏప్రిల్ 26: ఎన్నికల నేపథ్యంలో తనిఖీల్లో భాగంగా ఆధారాలు లేకుండా తరలిస్తున్న రూ.53,000 నగదును చందుర్తి పోలీసులు శుక్రవారం స్వాధీనం చేసుకున్నారు. చందుర్తి మండలం మర్రిగడ్డ గ్రామంలో ఎన్నికల నేపథ్యంలో తనిఖీలు చేపట్టగా చందుర్తికి చెందిన సాయి వంశీని తనిఖీ చేశారు. ఈ మేరకు నగదు బయటపడినట్లు తెలిపారు. రూ. 50 వేలకు పైగానగదు తీసుకెళ్లేటప్పుడు దానికి సంబంధించిన పూర్తి ఆధారాలు దగ్గర ఉంచుకోవాలని లేనట్లయితే స్వాధీనం చేసుకుంటామని చందుర్తి సీఐ వెంకటేశ్వర్లు, ఎస్సై శ్రీకాంత్ తెలిపారు.

భూ ఆక్రమణ కేసులో పోలీసు కస్టడీకి నిందితులు

కరీంనగర్ క్రైం, ఏప్రిల్ 26: నకిలీ ధ్రువపత్రాలు సృష్టించి, ఇదివరకే విక్రయించిన భూమిని తిరిగి ఆక్రమించినందుకు అరెస్టు అయి జైలులో ఉన్న నిందితులు మూల తిరుమలరెడ్డి, లంక శేఖర్‌ను కరీంనగర్ రూరల్ సీఐ ఏ ప్రదీప్‌కుమార్ కోర్టు ద్వారా 24 గంటల పోలీస్ కస్టడీకి తీసుకున్నారు. అనంతరం ఇద్దరి ఇళ్లలో సోదాలు నిర్వహించి పలు కీలక డాక్యుమెంట్లను స్వాధీనం చేసుకున్నారు. నకిలీ ధ్రువపత్రాలు సృష్టించి, ఇదివరకే విక్రయించిన భూమిని తిరిగి ఆక్రమించినందుకుగాను బాధితుడు కరీంనగర్ జిల్లా గన్నేరువరం గ్రామానికి చెందిన తెల్ల రాజయ్య పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు విచారణ చేపట్టిన కరీంనగర్ రూరల్ పోలీసులు, నలుగురు వ్యక్తులపై కేసు నమోదు చేశారు. అందులో ఇద్దరిని కరీంనగర్ తీగలగుట్టపల్లికి చెందిన మూల తిరుమలరెడ్డి, కరీంనగర్ విద్యారణ్యపురి కాలనీకి చెందిన లంక శేఖర్‌ను అదుపులోకి తీసుకుని కోర్టులో హాజరుపరిచారు. మెజిస్ట్రేట్ ఆదేశాలతో 14 రోజుల రిమాండ్‌కు తరలించిన విషయం విదితమే. ఈ కేసులో మరింత విచారణ చేసేందుకు సీఐ ఏ ప్రదీప్ కుమార్ నిందితులిద్దరి ఇళ్లలో సోదాలు జరిపి కేసుకు సంబంధించిన పలు కీలక డాక్యుమెంట్లను స్వాధీన పరుచుకున్నారు.



నిందితుల ఇళ్లలో సోదాలకు తీసుకువెళుతున్న సీఐ ఏ ప్రదీప్‌కుమార్

ఘనంగా పోచమ్మ బోనాలు



బోనాలతో ఆలయానికి వెళుతున్న మహిళలు

కొడిమ్యాల, ఏప్రిల్ 26: మండలంలోని చెప్యాల గ్రామంలో శుక్రవారం రజక సంఘం ఆధ్వర్యంలో పోచమ్మ బోనాలు నిర్వహించారు. గ్రామంలోని రజక కులస్తులు, సుమారు 60 మహిళలు బోనాలను నెత్తిన పెట్టుకొని ఆలయం వరకు డప్పుచప్పుళ్లతో నృత్యాలు చేస్తూ ఊరేగింపుగా ఆలయం వద్దకు వెళ్లి పూజలు చేసారు. అనంతరం నైవేద్యాలను సమర్పించుకున్నారు. పిల్లా పాపలను చల్లంగా చూడాలని పోచమ్మ దేవతకు మొక్కులు చెల్లించుకున్నారు. మడలేశ్వరస్వామి ఆలయ ప్రాంగణంలో ఈదమ్మ, నందీశ్వరుల విగ్ర హాలను ప్రతిష్ఠించారు. కార్యక్రమాల్లో రజక సంఘం నాయకులు, సభ్యులు పాల్గొన్నారు.

సీడ్ ప్లాంట్‌లో పోలీసుల తనిఖీలు

శంకరపట్నం, ఏప్రిల్ 26: శంకరపట్నం మండలం మొలంగూర్ శివారులోని కావేరి సీడ్ ప్లాంట్‌లో సీపీ ఆదేశాల మేరకు హుజూరాబాద్ రూరల్ సీఐ వెంకట్ ఆధ్వర్యంలో కేశవపట్నం పోలీసులు, కేంద్ర బలగాలు ఆకస్మిక తనిఖీలు చేశారు. ఈ సందర్భంగా కావేరి సీడ్ ప్లాంట్‌లో ఇతర రాష్ట్రాల నుంచి వచ్చి పనిచేస్తున్న వలస కార్మికుల ఆధార్‌కార్డులు, ఇతర అడ్రస్ ప్రూఫులను పరిశీలించారు. ప్లాంట్ ఆవరణలో వారు నివాసం ఉండే క్వార్టర్స్‌లో కార్మికులు అసాంఘిక కార్యకలాపాలకు పడుతున్నారా, ఏవైనా మత్తు పదార్థాలు వాడుతున్నారా అనే విషయంపై పూర్తి స్థాయిలో తనిఖీ నిర్వహించారు. అనంతరం సీఐ వెంకట్ సీడ్ ప్లాంట్ నిర్వాహకులతో మాట్లాడారు. వలస కార్మికుల పూర్తి ఆధారలతో కూడి వివరాలను రిజిస్టర్‌లో నమోదు చేయాలన్నారు. వారి ప్రవర్తనను ఎప్పటికప్పుడు గమనించాలన్నారు. అనంతరం పార్లమెంట్ ఎన్నికల సందర్భంగా ఆముదాలపల్లి ఎక్స్ రోడ్ వద్ద వాహనాలను తనిఖీ చేశారు. కార్యక్రమంలో కేశవపట్నం ఎస్ఐ పాకాల లక్ష్మారెడ్డి, పోలీసులు, కేంద్ర బలగాలు పాల్గొన్నారు.

హ్యాండ్‌బాల్ పోటీల విజేత కరీంనగర్ మహిళా జట్టు



చాంపియన్‌గా నిలిచిన మహిళల కరీంనగర్ జట్టు

కరీంనగర్ స్పోర్ట్స్, ఏప్రిల్ 26: తెలంగాణ హ్యాండ్ బాల్ అసోసియేషన్ హాయ్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఫస్ట్ తెలంగాణ హ్యాండ్ బాల్ ప్రీమియం లీగ్ పోటీల్లో కరీంనగర్ జిల్లా మహిళల జట్టు విజయం సాధించింది. ఈనెల 24, 25, 26 తేదీల్లో మంచిర్యాల జిల్లా నస్పూర్‌లో నిర్వహించిన ఈ పోటీల్లో కరీంనగర్ జిల్లా మహిళల జట్టు రాష్ట్రంలోని వివిధ జట్లపై విజయం సాధించి ట్రోఫీ గెలుచుకుందని జిల్లా అండ్ వాల్ అసోసియేషన్ హాయ్ బాధ్యులు జిట్టవేణి శ్రీనివాస్ తెలిపారు .ఈ సందర్భంగా ప్రథమ స్థానం సాధించిన మహిళల జట్టును జిల్లా ఉపాధ్యాయ సంఘం అధ్యక్ష కార్యదర్శులు అంతడుపుల శ్రీనివాస్ ,ఎం.డి యూనిస్ పాషా, జిల్లా ఒలంపిక్ అసోసియేషన్ అధ్యక్ష ,కార్యదర్శులు నందెలి మహిపాల్, గసిరెడ్డి జనార్దన్ రెడ్డి, హ్యాండ్ బాల్ అసోసియేషన్ బాధ్యులు కలిగేటి శ్రీనివాస్, జట్టుపల్లి అశోక్ ,రాజ్ కుమార్, భాస్కర్ ,వడ్లూరి రాజేందర్, ఐతర వేణి శ్రీనివాస్ , అనుప్ రెడ్డి, వీరుపాల్ రెడ్డి తదితరులు అభినందించారు.

ఆరేళ్ల అనంతరం నిందితుడి అరెస్టు

- కేసు నుంచి తప్పించుకోవడానికి విదేశాలకు

- తిరిగివస్తుండగా ఏయిర్‌పోర్టులో అదుపులోకి తీసుకున్న పోలీసులు



మాట్లాడుతున్న డీఎస్పీ రఘుచందర్

మల్యాల, ఏప్రిల్ 26: ఎస్సీ, ఎస్టీ, పోక్సో కేసులో నిందితుడిని ఆరేళ్ల అనంతరం శుక్రవారం పోలీసులు అరెస్టు చేశారు. జగిత్యాల డీఎస్పీ రఘుచందర్ తెలిపిన వివరాల ప్రకారం.. 2018లో సాజిద్‌ఖాన్, సాయిగణేష్, సాగర్, బావు మహేష్ అనే యువకులపై ఎస్సీ, ఎస్టీ, పోక్సో కేసు నమోదు అయింది. కేసు నుంచి తప్పించుకోవడానికి మహేష్ విదేశాలకు వెళ్లాడు. మిగితా ముగ్గురు నిందితులను గతంలోనే పోలీసులు అరెస్ట్ చేసి కోర్టులో హాజరుపరిచారు. మహేష్ ఇండియా వస్తున్నా డనే సమాచారం మేరకు మల్యాల సీఐ నీలం రవి ఆధ్వర్యంలో పోలీసులు శుక్రవారం హైదరాబాద్‌లోని ఏయిర్‌పోర్టులో అరెస్ట్ చేశారు. అనంతరం కోర్టులో హాజరు పరిచారు.

మే 3న డాక్ అదాలత్

భగత్‌నగర్, ఏప్రిల్ 26: భారతీయ తపాలశాఖ ఆధ్వర్యంలో మే 3వ తేదీన డాక్ అదాలత్ కార్యక్రమం ని ర్వహించనున్నట్లు కరీంనగర్ డివిజన్ పోస్టల్ సూపరిం టెండెంట్ కె శివాజీ ఒకప్రకటనలో తెలిపారు. పోస్టల్ శాఖకు సంబంధించి ప్రజలకు సంబంధించిన సలహాలు సూచనలు, ఫిర్యాదులను రెండవ డాక్ ఆదాలత్‌లో స్వీకరించనున్నట్లు తెలిపారు. కోర్టు పరిధిలో పెండింగ్‌లో ఉన్న వాటిని డాక్ అదాలత్‌లో స్వీకరిస్తామని తెలిపారు. ఈనెల 29వ తేదీ వరకు ఫిర్యాదులు, సలహాలు సూచ నలు అందించాలన్నారు. కరీంనగర్ డివిజన్ పరిధిలోని జగిత్యాల, సిరిసిల్ల, కరీంనగర్ జిల్లాల పరిధిలోని సమ స్యలను పోస్టల్ ఎన్‌వలప్స్, కవర్స్‌ను కె శివాజీ, సూ పరిండెండెంట్, పోస్ట్ ఆఫీస్ కరీంనగర్ డివిజన్, కరీం నగర్-505001 అడ్రస్‌కు 29వ తేదీలోగా చేరుకునే విధం గా పంపించాలన్నారు. మే 3న డాక్ అదాలత్ కరీంనగర్ సూపరింటెండెంట్ కార్యాలయం, కరీంనగర్ డివిజన్ మొదటి అంతస్తులో నిర్వహించనున్నట్లు తెలిపారు.

వైభవోపేతంగా అవబృధ చక్రస్నానం



కలశాభిషేకం నిర్వహిస్తున్న అర్చకులు

ఇల్లందకుంట, ఏప్రిల్ 26: శ్రీసీతారామచంద్రస్వామి దేవాలయంలో జరిగే బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆలయ ప్రధాన అర్చకుడు శేషం రామాచార్యులు, అర్చకులు వంశీధరాచార్యులు, యాజ్ఞికులు శేషం సీతారామాచార్యుల మంత్రోచ్చరణాల నడుమ వైభవోపేతంగా అవబృధ చక్రస్నానం నిర్వహించారు. ఉదయం ప్రత్యేక పూజల అనంతరం అష్టోత్తరశత (108) కలశాభిషేకం కార్యక్రమం జరిపించారు. స్వామివారి ఉత్సమూర్తులను బాజాభజంత్రిలు, మేళా తాళాలు, వేద బ్రాహ్మణుల మంత్రోచ్చరణల నడుమ ఆలయ ఆవరణలోని కోనేరు వద్దకు తీసుకెళ్లి అవబృద చక్రస్నానం చేపట్టారు. కార్యక్రమంలో ఆలయ ఈవో కందుల సుధాకర్, భక్తులు సురేందర్‌రెడ్డి, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

● కన్నుల పండువగా శ్రీపుష్పయాగం

మండల కేంద్రంలోని శ్రీసీతారామచంద్రస్వామి దేవాలయంలో జరిగే బ్రహ్మోత్సవాల్లో భాగంగా శుక్రవారం కన్నుల పండువగా శ్రీపుష్పయాగం (నాఖబలి) ఆలయ ప్రధాన అర్చకులు శేషం రామాచార్యులు, వంశీధరచార్యులు, యాజ్ఞికులు శేషం సీతారామాచార్యులు మంత్రోచ్చరణాల నడుమ నిర్వహించారు. రాత్రి 9గంటలకు ద్వాదశా రాధన నిత్యవిధి అనంతరం శ్రీపుష్పయాగం (నాఖబలి) జరిపించారు. కార్యక్రమంలో భక్తులు పండ్లు, పూలు, శ్రీసీతారామచంద్రస్వామి మూర్తులకు సమర్పించారు. నాఖబలి సందర్భంగా తీరొక్క పూలతో కల్యాణ వేదికను ఘనంగా అలంకరించి వేదబ్రహ్మణుల మంత్రోచ్చరణల నడుమ శ్రీపుష్పయాగం జరిపించారు. కార్యక్రమంలో ఈవో సుధాకర్, మహిళా భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొనగా వారికి తీర్థ ప్రసాదాలు అందించారు.



కోనేరులో అవబృధ చక్రస్నానం నిర్వహిస్తున్న అర్చకులు

'అల్గిరెడ్డి'ని కలిసిన వెలిచాల రాజేందర్‌రావు



ప్రవీణ్‌రెడ్డితో మాట్లాడుతున్న వెలిచాల రాజేందర్‌రావు

కరీంనగర్ అర్బన్, ఏప్రిల్ 26: పార్లమెంట్ ఎన్నికల్లో కరీంనగర్ కాంగ్రెస్ టికెట్ ఆశించి బంగపడ్డ హుస్నాబాద్ మాజీ ఎమ్మెల్యే అల్గిరెడ్డి ప్రవీణ్‌రెడ్డిని కాంగ్రెస్ పార్టీ ఎంపీ అభ్యర్థి వెలిచాల రాజేందర్ రావు మర్యాదపూర్వకంగా కలిశారు. ప్రవీణ్‌రెడ్డి స్వగ్రామం భీమదేవరపల్లి మండలం ముల్కనూర్‌లో శుక్రవారం కరీంనగర్ డీసీసీ అధ్యక్షుడు కవ్వంపల్లి సత్యనారాయణతో కలిసి ఆయన భేటీ అయ్యారు. కలిసికట్టుగా అందరం కలిసి పనిచేద్దామని కరీంనగర్ ఎంపీగా విజయం సాధించేందుకు సహకారం కావాలనీ రాజేందర్‌రావు ఈ సందర్భంగా ప్రవీణ్‌రెడ్డిని కోరారు. ఇందుకు సానుకూలంగా స్పందించిన మాజీ ఎమ్మెల్యే ప్రవీణ్‌రెడ్డి కాంగ్రెస్ పార్టీ గెలుపు కోసం కృషి చేస్తామన్నారు.

పొట్టి శ్రీరాములు విగ్రహ ముసుగును తొలగించండి

కరీంనగర్ టౌన్, ఏప్రిల్ 26: జిల్లాకేంద్రంలోని టవర్‌సర్కిల్ ప్రాంతంలోగల ప్రముఖ గాంధేయవాది, స్వాతంత్ర్య సమరయోధులు అమరజీవి పొట్టి శ్రీరాములు విగ్రహానికి జిల్లా అధికారులు పార్లమెంట్ ఎన్నికల నిబంధనల పేరుతో వేసిన ముసుగును తొలగించాలని పొట్టి శ్రీరాములు ఫౌండేషన్ ప్రభుత్వాన్ని కోరింది. ఈ మేరకు శుక్రవారం పొట్టి శ్రీరాములు ఫౌండేషన్ చైర్మన్ ఉప్పల రామేశం ఎన్నికల రిటర్నింగ్ అధికారి, జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి, ఎన్నికల సాధారణ పరిశీలకుడు అమిత్‌కటారియాకు వినతిపత్రం అందజేశారు. పొట్టి శ్రీరాములకు ఏ రాజకీయ పార్టీతో సంబంధం లేదని, ఏ రాజకీయ పదవి నిర్వహించలేదన్నారు. తెలుగువారికి ప్రత్యేక రాష్ట్రం కావాలనే లక్ష్యంతో 58 రోజులు ఆమరణ దీక్ష చేపట్టి ప్రాణత్యాగం చేసిన అమరజీవి విగ్రహానికి ఎన్నికల నిబంధనల పేరుతో ముసుగువేయడం ఆయనను అగౌరవ పరచడమేనని, వెంటనే ముసుగును తొలగించాలని కోరారు.

అంగన్‌వాడీ పిల్లలకు అవగాహన కార్యక్రమం

కరీంనగర్ రూరల్, ఏప్రిల్ 26: మండలంలోని చెర్లబూత్కూర్‌లో అంగన్‌వాడీ ఆధ్వర్యంలో పిల్లలకు అవగాహన కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా సంక్షేమాధికారి సరస్వతి హాజరై పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పిల్లలకు ఎనీమియా, యోగాపై అవగాహన కల్పించారు. సమస్యలుంటే 181 టోల్ ఫ్రీ నంబర్‌కు సమాచారం అందించాలని తెలిపారు. గర్భిణులకు నార్మల్ డెలివరీతో కలిగే లాభాలను గురించి వివరించారు. కార్యక్రమంలో సీడీపీవో లక్ష్మీనారాయణ, సూపర్‌వైజర్ నిర్మల, డీసీపీవో శాంత, కోఆర్డినేటర్ విమల, డీపీఏ రోమల, అంగన్‌వాడీ టీచర్లు పద్మ, భాగ్య, రాజేశ్వరి, సరిత తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలకు ఎమ్మెల్యే 'గంగుల' పరామర్శ

కరీంనగర్ టౌన్, ఏప్రిల్ 26: బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు మైఖేల్ శ్రీనివాస్ తండ్రి కొత్తకొండ రాజయ్య ఇటీవల అనారోగ్యంతో మృతిచెందగా మైఖేల్ శ్రీనివాస్‌ను, ప్రమాదంలో తీవ్రగాయాలై విశ్రాంతి తీసుకుంటున్న పార్టీనాయకుడు కుండ మల్లయ్యను మాజీ మంత్రి, ఎమ్మెల్యే గంగుల కమలాకర్ పరామర్శించారు. శుక్రవారం ఆయన వారి ఇళ్లకు సివిల్ సప్లయిస్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ రవీందర్‌సింగ్, బీఆర్ఎస్ నగర అధ్యక్షుడు చల్ల హరిశంకర్, కార్పొరేటర్ ఐలేందర్‌యాదవ్‌తో కలిసి వెళ్లి పరామర్శించారు. ఎమ్మెల్యే వెంట నాయకులు కలర్ సత్తెన్న, గూడెల్లి రాజ్‌కుమార్, పూసల శ్రీకాంత్, రవికాంత్ తదితరులున్నారు.

కరపత్రం ఆవిష్కరణ

కరీంనగర్ కల్చరల్, ఏప్రిల్ 26: లౌకిక విలువలు-సాహిత్యం అనే అంశంపై ఈ నెల 28న వరంగల్‌లో జరుగుతున్న రాష్ట్రస్థాయి సదస్సుకు ఆలోచనాపరులైన బుద్ధి జీవులు హాజరు కావాలని తెలంగాణ రచయితల వేదిక పిలుపినిచ్చింది. ఈ సందర్భంగా సమూహ రాష్ట్రస్థాయి సదస్సుకు చెందిన కరపత్రాన్ని శుక్రవారం అమరవీరుల స్తూపం వద్ద ఆవిష్కరించారు. సమాజంలో శాంతియుత సహజీవనాన్ని ఎత్తిపట్టేందుకు, సుస్థిర ప్రశాంతత నెలకొల్పేందుకు కవులు, రచయితలు తమ కలాలను ఎక్కు పెట్టాలని సమూహ రాష్ట్ర స్టీరింగ్ కమిటీ మెంబర్ గాజోజు నాగభూషణం అన్నారు. రచయిత కందుకూరి అంజయ్య మాట్లాడుతూ ప్రజల మధ్య ఐక్యత పెంపొందించి సమాజంలో సౌభాగ్యాన్ని వర్ధిల్లజేయాలనే సమూహ సదస్సు నిర్వహిస్తున్నారని అన్నారు. కార్యక్రమంలో సీవి కుమార్, దామరకుంట శంకరయ్య, నడిమెట్ల రామయ్య, విలాసగరం రవీందర్, చైతన్య, ఖాలీద్, శ్రీనివాస్, బసవేశ్వర్, సదాశ్రీ, వరప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

గర్భిణులు పోషకాహారం తీసుకోవాలి



తాడికల్ అంగన్‌వాడీ కేంద్రంలో ఫ్రై డే గ్రామసభ నిర్వహిస్తున్న సిబ్బంది

శంకరపట్నం, ఏప్రిల్ 26: గర్భిణులు పోషకాహారం తీసుకుంటే పిల్లలు ఆరోగ్యంగా ఉంటారని అంగన్‌వాడీ సూపర్‌వైజర్ స్రవంతి అన్నారు. మండలంలోని తాడికల్ గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రంలో ఫ్రై డే గ్రామసభ కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా పిల్లల బరువు, ఎత్తు పరిశీలించారు. అనంతరం సూపర్‌వైజర్ స్రవంతి మాట్లాడుతూ పిల్లలు ఆరోగ్యంగా ఉండేందుకు తల్లులు పోషకాహారం అందించాలన్నారు. సీజన్‌లో దొరికే పండ్లు తినాలని తెలిపారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి సమ్మ రాజేశ్వర్, అంగన్‌వాడీ టీచర్ శిరీష, ఏఎన్ఎం, ఆశా వర్కర్లు, తల్లులు తదితరులు పాల్గొన్నారు.

పోషకాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం

గంగాధర, ఏప్రిల్ 26: పోషకాహారంతోనే పిల్లలు సంపూర్ణ ఆరోగ్యంగా ఉంటారని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ రేణుక అన్నారు. మండలంలోని ఉప్పరమల్యాల లో పోషకాహారం పై పిల్లలు, తల్లులకు శుక్రవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ గర్భిణులు పోషకాలతో కూడిన సమతుల ఆహారం తీసుకుంటే పుట్టే బిడ్డలు ఆరోగ్యంగా ఉంటారని తెలిపారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్ రాజేశ్వరి, ఆశాకార్యకర్త ఎల్లమ్మ, పిల్లలు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

విద్యార్థులు నైపుణ్యాలు మెరుగు పరుచుకోవాలి



ఉద్యోగాలకు ఎంపికైన విద్యార్థులు

తిమ్మాపూర్, ఏప్రిల్ 26: విద్యార్థులు నైపుణ్యాలు మెరుగు పరుచుకోవాలి శ్రీచైతన్య విద్యా సంస్థల చైర్మన్ ముద్దసాని రమేశ్‌రెడ్డి అన్నారు. శ్రీచైతన్య ఫార్మసీ కళాశాలలో శుక్రవారం మెడికో కంపెనీ నిర్వహించిన ప్రాంగణ నియామకాల్లో. బిఫార్మసీ, ఎంఫార్మసీ చివరి సంవ త్సరం చదువుతున్న 34 మంది విద్యార్థులు ఉద్యోగాలకు ఎంపికయ్యారని తెలిపారు. ఎంపి కైన విద్యార్థులకు 2.1లక్షల వార్షిక వేతనం కంపెనీ ఇవ్వనున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ కర్ర నరేందర్ రెడ్డి, ప్రిన్సిపాళ్లు ఎ రామనర్సింహారెడ్డి, వెంకటేశ్వర్లు, హెచ్ఓ డీలు రవీందర్‌రెడ్డి, చంద్రమౌళి, రాంప్రసాద్ ధనుంజయ్ పాల్గొన్నారు.

బాలభవన్ పోదాం..రండి

- ప్రారంభమైన వేసవి శిక్షణా తరగతులు
- బాలలకు పలు అంశాల్లో శిక్షణకు ఆహ్వానం

కరీంనగర్ కల్చరల్, ఏప్రిల్ 26: భారతీయ కళలకు ఎంతో ప్రాధాన్యం ఉంది. ఆయా కళల్లో నిష్ణాతులైన వారు ప్రపంచవ్యాప్తంగా ఎంతో ప్రాచుర్యం పొంది పలు సన్మానాలు, సత్కారాలు అందుకున్నారు. చిన్నతనం నుంచే ఆయా కళల్లో శిక్షణ పొందితే అవి తమ జీవితాలనే మలుపు తిప్పుతాయి. ఇప్పుడు వేసవి కాలం వచ్చేసింది. బడులకు సెలవులిచ్చేశారు. ఇంకేం.... విరామ కాల సద్వినియోగం చేసుకొని నచ్చిన అంశాల్లో విద్యార్థుల ప్రతిభను మరింత మెరుగుపరిచి వారికి శిక్షణ ఇవ్వడం కోసం బాలభవన్ తల్లిలా తన ఒడి చేర్చుకునేందుకు ఆహ్వానిస్తోంది.

కలెక్టర్, విద్యాశాఖ సహకారంతో ఈ నెల 25 నుంచి ప్రతీ రోజు ఉదయం ఎనిమిది గంటల నుంచి ఒంటి గంట వరకు జూన్ 8వ తేదీ వరకు శిక్షణా తరగతులు కొనసాగనున్నాయి. ఈ శిక్షణా కార్యక్రమానికి ఐదు నుంచి 16 సంవత్సరాల వయస్సు గల బాల బాలికలు అర్హులు. పాల్గొనే ఔత్సాహిక బాల బాలికలు తమ ఆధార్, పాస్‌పోర్ట్ సైజ్ ఫొటో అందించి పేర్లను అంబేడ్కర్ స్టేడియంలోని శిక్షణా శిబిరంలో నమోదు చేసుకోవాల్సిన అవసరం ఉంటుంది.



మృదంగం నేర్చుకుంటున్న బాలలు (ఫైల్)



ఆర్ట్ అండ్ క్రాఫ్ట్‌లో శిక్షణ(ఫైల్)

● ఈ అంశాల్లో శిక్షణ..

ఎస్ కృష్ణకుమార్ పర్యవేక్షణలో చిత్రలేఖనం, పెన్సిల్ పేయింటిగ్స్, హ్యాండ్ రైటింగ్, కె మంజులాదేవి శిక్షణలో గాత్ర సంగీతం, కర్ణాటక సంగీతం, లలిత, దేశభక్తి గేయాలు, శ్రీధర్ నేతృత్వంలో మృదంగం, దబల, కంజీర, సంగెం రాధాకృష్ణ ఆధ్వర్యంలో జనపద, క్లాసికల్, సెమీ క్లాసికల్, వెస్టన్ నృత్యం, సూర్యశ్రీ శిక్షణలో ఆర్ట్ అండ్ క్రాఫ్ట్, టైలరింగ్, ఎంబ్రాయిడరీ, మగ్గం, బ్యూటీషియన్, మెహంది కోర్సులలో శిక్షణ కొనసాగనుంది. మిగతా వివరాలకు అంబేడ్కర్ స్టేడియంలోని బాలభవన్ కేంద్రాన్ని సంప్రదిచంచవచ్చు.

● శిక్షణను వినియోగించుకోవాలి..

- కట్ట మంజులాదేవి, సూపరెంటెండెంట్, బాలభవన్



ప్రతీ యేటా ఎంతో మంది చిన్నారులు, తల్లిదండ్రుల నుంచి మంచి స్పందన వస్తోంది. నచ్చిన అంశాల్లో శిక్షణ కోసం చిన్నారులను ప్రభుత్వం తరపున బాలభవన్ ఆహ్వానిస్తోంది. 45 రోజుల పాటు శిక్షణ పూర్తి చేసుకున్న చిన్నారులకు ప్రశంసాపత్రాలు ప్రదానం చేయనున్నాం.

ఎడ్‌టాక్స్‌లో పారమిత విద్యార్థుల ప్రదర్శన

కరీంనగర్ టౌన్, ఏప్రిల్ 26: అంతర్జాతీయ స్థాయిలో అమెరికా వారు నిర్వహించే ప్రతిష్టాత్మకమైన ఎడ్ టాక్స్ కార్యక్రమాలను స్ఫూర్తిగా తీసుకొని పారమిత విద్యార్థులు ఎడ్ టాక్స్ కార్యక్రమంలో పాల్గొన్నట్లు పారమిత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు బాలాజీ తెలిపారు. శుక్రవారం స్థానిక ఓ ప్రైవేట్ హోటల్‌లో జరిగిన ఈకార్యక్రమంలో ఐదో తరగతికి చెందిన పెంచాల మాన్వి లైఫ్‌స్కిల్స్ అనే అంశంపై, రసపల్లి హదస్సది త్రి యూనిక్ నెస్ అనే అంశంపై, ఆరో తరగతికి చెందిన సిద్రమా ఆఫ్ షీన్ ఇంపాక్టు ఆఫ్ సోషల్ మీడియా అనే హ్యూమన్ బీయింగ్స్ అనే అంశంపై, 7వ తరగతికి చెందిన సయ్యద్ జక్వాన్ హార్నెస్ ప్లాట్యుస్ ఆఫ్ లాటెంట్ పొటెన్షియల్ అనే అంశంపై, తోట హర్షిత్ ఏషియాంట్ ఇండియా అజ్ మోడ్రెన్ ఇండియా అనే అంశంపై, చీరాల లాలిత్య క్రిష్ణ ప్రణవి పర్సనల్ ఐడెంటిటి అనే అంశంపై తమ అద్భుతమైన ప్రసంగాలతో సభికుల్లో ఆలోచనా దృక్పథాన్ని పెంచారని అన్నారు. విద్యార్థుల్లోని నైపుణ్యాలను, ప్రతిభను వెలికి తీసేందుకు ఎడ్ టాక్స్ అనే కార్యక్రమం ఎంతగానో ఉపయోగపడుతుందని అభినందించారు. కార్యక్రమంలో పాల్గొన్న విద్యార్థులను పారమిత విద్యాసంస్థల అధినేత డాక్టర్ ఇ ప్రసాదరావు, ఎస్ఆర్ఆర్ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె రామకృష్ణ, ఆంగ్లోపాధ్యాయుడు డాక్టర్ నిఖిల్, కిమ్స్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ హరిప్రసాద్, విట్స్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ మురళి, వాగేశ్వరి కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వి రాంచందర్‌రావు, పలువురు ప్రభుత్వ, ప్రైవేట్ విద్యాసంస్థల ప్రతినిధులు, ఉపాధ్యాయులు అభినందించారు.

రేపు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పర్యటన

కరీంనగర్ టౌన్, ఏప్రిల్ 26: బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కల్వకుంట్ల తారక రామారావు ఆదివారం కరీంనగర్ పార్లమెంట్ పరిధిలోని నాలుగు నియోజకవర్గాల్లో పర్యటించనున్నట్లు పార్టీజిల్లా అధ్యక్షుడు జీవీ రామకృష్ణారావు తెలిపారు. వేములవాడ నియోజకవర్గంలో ఉదయం 11 గంటలకు, మానకొండూర్ నియోజకవర్గంలో మధ్యాహ్నం రెండు గంటలకు, కరీంనగర్ నియోజకవర్గంలో సాయంత్రం నాలుగు గంటలకు జరిగే పార్టీ బూత్ కమిటీ స్థాయి సమావేశాల్లో కేటీఆర్ పాల్గొంటారని తెలిపారు. అలాగే సాయంత్రం ఆరు గంటలకు చొప్పదండి నియోజకవర్గకేంద్రంలో రోడ్‌షోలో పాల్గొని ప్రసంగిస్తారని తెలిపారు. పార్టీశ్రేణులు, అభిమానులు, నాయకులు, ప్రజాప్రతినిధులు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

ప్రజా వ్యతిరేక కార్యక్రమాలపై చర్యలు తీసుకోవాలి

సుభాష్‌నగర్, ఏప్రిల్ 26: యంసీపీఐ(యూ) పేరుతో కొంతమంది పార్టీ ద్రోహులు ప్రజా వ్యతిరేక కార్యక్రమాలు చేస్తున్నారని వారిపై చర్యలు తీసుకోవాలని యంసీపీఐ(యూ) జాతీయ కార్యదర్శి మద్దికాయల అశోక్ ఓంకార్, రాష్ట్ర కార్యదర్శి గాదగొని రవి డిమాండ్ చేశారు. శుక్రవారం నగరంలోని ప్రెస్‌భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ మే 13న జరగనున్న పార్లమెంట్ ఎన్నికల్లో యంసీపీఐ(యూ)పార్టీ తెలంగాణ రాష్ట్రంలో వరంగల్, చేవేళ్ల, నల్గొండ పార్లమెంట్ స్థానాల్లో పోటీ చేస్తున్నదని తెలిపారు. మిగితా నియోజకవర్గాల్లో బహుజన సామాజిక శక్తులకు మద్దతు ఇస్తున్నామన్నారు. కరీంనగర్ పార్లమెంట్ స్థానంలో యంసీపీఐ(యూ) పోటీలో లేదని తెలిపారు. అయితే పార్టీ క్రమశిక్షణ చర్యలకు గురైన లింగంపల్లి శ్రీనివాస్‌రెడ్డి, యంసీపీఐ(యూ) పార్టీ తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి అని పత్రికలు, సోషల్ మీడియాలో ప్రచారం చేసుకొని, గందరగోళం సృష్టిస్తూ ఎన్నికల కమిషన్‌ను, పార్టీ శ్రేణులను ఆయోమయానికి గురిచేసి నామినేషన్ వేశారని ఆరోపించారు. ఇదే విషయమైన కలెక్టర్‌కు ఫిర్యాదు చేశామని తెలిపారు. పార్టీ పేరుతో వాణిజ్య, వ్యాపారుల వద్ద మోస పూరిత పద్ధతిలో చందాలు వసూలు చేయడాన్ని పార్టీ తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. అతనిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరారు. సమావేశంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యులు వల్లేపు ఉపేందర్‌రెడ్డి, గోనె కుమారస్వామి, మంద రవి, ఎండీ అహ్మద్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజలకు అందుబాటులోలేని బండి సంజయ్

- సుడా చైర్మన్, కాంగ్రెస్ నగర అధ్యక్షుడు కోమటిరెడ్డి నరేందర్‌రెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న నరేందర్‌రెడ్డి

కరీంనగర్ అర్బన్, ఏప్రిల్ 26: ఎంపీగా గెలిచిన తరువాత ఐదు సంవత్సరాలు ప్రజలకు అందుబాటులో లేకుండాపోయిన బండి సంజయ్‌కుమార్ లోకల్- నాన్ లోకలా తేల్చుకోవాలని సుడా చైర్మన్, నగర కాంగ్రెస్ అధ్యక్షుడు కోమటిరెడ్డి నరేందర్‌రెడ్డి అన్నారు. నగర కాంగ్రెస్ కార్యాలయంలో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈ దేశంలో ఎంపీ ల్యాండ్స్ నిధులు కూడా ఖర్చు చేయని అసమర్థ ఎంపీ ఎవరైనా ఉన్నారంటే ఆయన బండి సంజయ్ కుమారే అని ఎద్దేవా చేశారు. కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి వెలిచాల రాజేందర్‌రావు కరీంనగర్ మార్కెట్ కమిటీ చైర్మన్‌గా పనిచేశాడనీ, గతంలో ఎంపీగా కరీంనగర్ నుంచి పోటీ చేశాడని, నిరంతరం ప్రజలకు అందుబాటులో ఉండి పనిచేయాలనే చిత్తశుద్ధితో పోటీ చేస్తున్నాడని నరేందర్‌రెడ్డి పేర్కొన్నారు. గురువులకు పంగనామాలు పెట్టిన చరిత్ర ఉన్న సంజయ్ కుమార్‌కు కాంగ్రెస్ పార్టీ గురించి మాట్లాడే అర్హత లేదని నరేందర్‌రెడ్డి అన్నారు. కేంద్రంలో అధికారంలో ఉన్న పార్టీకి తెలంగాణ అధ్యక్షుడిగా ఉండి కూడా ఎటువంటి అభివృద్ధి నిధులు తీసుకురాని వ్యక్తి మళ్లీ వచ్చే అయిదేళ్లలో అభివృద్ధి చేస్తానంటే ఎవరు నమ్ముతారని నరేందర్‌రెడ్డి ప్రశ్నించారు. పొన్నం ప్రభాకర్ ఎంపీగా ఉన్నప్పుడు పాస్ పోర్ట్ ఆఫీస్, మాతా శిశు హాస్పిటల్, కేంద్రియ విద్యాలయాలు ఇలా ఎన్నో తీసుకువచ్చాడన్నారు. బండి సంజయ్ హయాంలో వచ్చినవి ఒక్కటన్నా చెప్పగలవా అని ఛాలెంజ్ చేశారు. విలేకరుల సమావేశంలో నాయకులు ఎండీ తాజ్, శ్రవణ్ నాయక్, దండి రవీందర్, బత్తిని చంద్రయ్య, ఎండీ చాంద్, ఊరడి లత, దన్న సింగ్, ముల్కల కవిత, జ్యోతిరెడ్డి, మహాలక్ష్మి, తిరుమల, హసీనా, శిల్ప, పెద్దిగారి తిరుపతి, జనగామ సతీష్ రావు, బొబ్బిలి విక్టరీ, కుర్ర పోచయ్య, మెతుకు కాంతయ్య, గౌరై శివ, షహేన్‌షా, గన్ను మహేందర్‌రెడ్డి, కంపల్లి కీర్తి కుమార్, యనమల మంజుల, ఆసిఫ్, అక్బర్ పాల్గొన్నారు.

ఆయిల్‌పామ్ సాగుపై దృష్టి సారించాలి

- రాష్ట్ర ఉద్యానవన, పట్టు పరిశ్రమ శాఖ సంచాలకుడు అశోక్‌రెడ్డి



ఆయిల్‌పామ్ మొక్కలను పరిశీలిస్తున్న అశోక్‌రెడ్డి

చిగురుమామిడి, ఏప్రిల్ 26: రైతు ఆయిల్‌పామ్ సాగుపై దృష్టి సారించాలని రాష్ట్ర ఉద్యానవన, పట్టు పరిశ్రమ శాఖ సంచాలకులు కె అశోక్‌రెడ్డి అన్నారు. మండల కేంద్రంలోని ఆయిల్‌పామ్ నర్సరీలను ఆయన శుక్రవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తక్కువ పెట్టుబడులతో అధిక దిగుబడి వచ్చే పంటల్లో భాగంగా ఆయిల్‌పామ్ తోటలను రైతులు ఎంచుకోవాలన్నారు. ప్రస్తుతం రాష్ట్రంలో నీటి ఎద్దడికి ఉన్నందున తక్కువ నీళ్లతో ఎక్కువ పండించే పంట ఆయిల్‌పామ్ సాగు చేయాలని ఆయన రైతు లకు సూచించారు. కార్యక్రమంలో జిల్లా అధికారి బి శ్రీనివాస్, మండల అధికారి మంజులవాణి, మేనేజర్ భరత్, నర్సరీ ఇన్‌చార్జి హరీష్, చిగురుమామిడి ఫీల్డ్ ఆఫీసర్ మ్యాదరవేని ప్రవీణ్, రైతులు తదితరులు పాల్గొన్నారు.

'మంత్రి వ్యవహార శైలి సరికాదు'

చిగురుమామిడి, ఏప్రిల్ 26: దేశ వ్యాప్తంగా ఇండియా కూటమిలో భాగంగా సీపీఐతో కాంగ్రెస్‌కు పొత్తు కొనసాగుతున్నా హుస్నాబాద్ నియోజకవర్గం పరిధిలో మంత్రి పొన్నం ప్రభాకర్ తమతో వ్యవహరిస్తున్న శైలి సరికాదని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు, మాజీ జడ్పీటీసీ సభ్యుడు అందె స్వామి అన్నారు. మండలంలోని లంబాడిపల్లిలో శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. అసెంబ్లీ ఎన్నికల్లో తమ పార్టీ ఓట్లతో గెలిచిన పొన్నం ప్రభాకర్ నేడు మంత్రి పదవి పొందాక సీపీఐ నాయకులతో, పార్టీ కార్యకర్తలతో మాట్లాడిన సందర్భాలు లేవని అన్నారు. మండల కేంద్రంలో శుక్రవారం కాంగ్రెస్ పార్టీ ఎంపీ అభ్యర్థి వెలిచాల రాజేందర్‌రావు రోడ్ షో కార్యక్రమానికి తమ పార్టీ నాయకులు, కార్యకర్తలను ఆహ్వానించక పోవడం దారుణమని వాపోయారు. రెండు పార్టీల నాయకులు కూడా పొత్తు ధర్మాన్ని పాటించాలని ఆయన కోరారు. సమావేశంలో పార్టీ మండల కార్యదర్శి నాగెల్లి లక్ష్మీరెడ్డి, జిల్లా కౌన్సిల్ సభ్యుడు, సింగిల్ విండో డైరెక్టరు శ్రీధర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కేంద్ర పథకాలను ప్రజలకు వివరించాలి

ఇల్లందకుంట, ఏప్రిల్ 26: కేంద్రం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను కార్యకర్తలు ప్రజలకు వివరించాలని బీజేపీ మండలాధ్యక్షుడు సింగిరెడ్డి తిరుపతిరెడ్డి అన్నారు. మండల కేంద్రంలో శక్తి కేంద్రాల ఇన్‌చార్జీలతో శుక్రవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆదివారం ఇల్లందకుంట మండలంలోని ప్రతి గ్రామంలో బూత్ అధ్యక్షులు, సీనియర్ నాయకులు, కార్యకర్తలు బీజేపీ కరపత్రాలను అందజేశారు. కేంద్రంలో మరోసారి బీజేపీ ప్రభుత్వం రాబోతుం దన్నారు. ఇల్లందకుంట ప్రజలు రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో బండి సంజయ్‌ను అధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో బైరెడ్డి రమణారెడ్డి, ఆరెల్లి శ్రీనివాస్, గురుకుంట్ల సాంబయ్య, రమేశ్, శ్రీనివాస్, రాజేందర్, రాంబాబు, పవన్‌రెడ్డి, సమ్మయ్య, రాజకుమార్, రమేష్, బాపరెడ్డి, అజయ్, రాజయ్య మొగిలి తదితరులు పాల్గొన్నారు

'అక్రమ లే అవుట్లపై చర్యలు తీసుకోవాలి'

హుజూరాబాద్, ఏప్రిల్ 26: హుజూరాబాద్, జమ్మికుంట మున్సిపాలిటీ పరిధిలో నిబంధనలకు విరుద్ధంగా ప్రభుత్వ, అసైన్డ్ భూములను కబ్జా చేసి అక్రమ లే అవుట్లు పెడుతున్న రియల్ ఎస్టేట్ వ్యాపారులపై చర్యలు తీసుకోవాలని ఎంఏయూడీ ప్రిన్సిపాల్ సెక్రటరీ దానా కిశోర్‌కు శుక్రవారం ఫిర్యాదు చేసినట్లు మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ తుమ్మేటి సమ్మిరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. హుజూరాబాద్ పట్టణంలోని వరంగల్, జమ్మికుంట, సైదాపూర్ రోడ్‌లో ఎలాంటి అనుమతులు లేకుండా రియల్ ఎస్టేట్ వ్యాపారులు ప్లాట్లు చేసి విక్రయిస్తున్నారని పేర్కొన్నారు. మున్సిపల్ అధికారులకు తెలిసినా పట్టించుకోవడం లేదని తెలిపారు. వరంగల్ రోడ్‌లో అసైన్డ్ భూములను కబ్జా చేసి అందులో ప్రభుత్వ గుట్టల నుంచి మొరంను తీసుకొచ్చి నాలా కన్వర్షన్ లేకుండానే నింపుతున్నారని పేర్కొన్నారు. కొంత మంది ప్రజాప్రతినిధులు రియల్ ఎస్టేట్ వ్యాపార అవతారం ఎత్తి అధికారులను అటూ వైపు కన్నెత్తకుండా చూస్తున్నారని పేర్కొన్నారు. స్పందించిన మున్సిపల్ ప్రిన్సిపాల్ సెక్రటరీ దానా కిశోర్ విచారణ జరుపుతామని హామీ ఇచ్చినట్లు తెలిపారు.

కాంగ్రెస్ ఎత్తుగడలను నమ్మవద్దు



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్

చొప్పదండి, ఏప్రిల్ 26: కాంగ్రెస్ ఎత్తుగడలను నమ్మవద్దని మాజీ ఎమ్మెల్యే సుంకె రవి శంకర్ అన్నారు. చొప్పదండిలో శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ప్రజలకిచ్చిన హామీలను నెరవేర్చడంలో కాంగ్రెస్ పార్టీ విఫలం అయ్యిందన్నారు. ఈనెల 28న చొప్పదండి పట్టణంలో బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ నిర్వహించే రోడ్డు షోను విజయవంతం చేయాలని బీఆర్ఎస్ అభ్యర్థి వినోద్‌కుమార్‌ను భారి మెజారిటీతో గెలిపించాలని కోరారు. సమావేశంలో ఎంపీపీ చిలుక రవీందర్, జెడ్పీటీసీ మాచర్ల సౌజన్య, సింగిల్ విండో చైర్మన్ మినిపాల తిరుపతిరావు, మాజీ గ్రంథాలయ సంస్థ అధ్యక్షుడు ఏనుగు రవీందర్‌రెడ్డి, మాజీ మార్కెట్ చెర్మన్‌లు గడ్డం చొక్కారెడ్డి, ఆరెల్లి చంద్రశేఖర్ గౌడ్, నూక రాజేశ్వర్‌రెడ్డి కార్యకర్తలు పాల్గొన్నారు.

రూ.7,400 పలికిన పత్తి ధర

జమ్మికుంట, ఏప్రిల్ 26: జమ్మికుంట వ్యవసాయ మా ర్కెట్లో క్వింటాల్ పత్తి ధర 7,400 రూపాయలు పలికింది. శుక్రవారం 19మంది రైతులు 276క్వింటాళ్లు విడి పత్తి, ముగ్గురు రైతులు మూడు క్వింటాళ్ల గోనె సంచుల్లో విక్ర యానికి తీసుకు వచ్చారు. ప్రైవేట్ ట్రేడర్స్ బహిరంగ వేలం పాట ద్వారా గరిష్ఠ ధర 7,400, కనిష్ఠ ధర 6,200 రూపాయలు చెల్లించి పత్తి కొనుగోళ్లు చేపట్టారు.

శిశు మందిర్ విద్యార్థినికి జాతీయస్థాయి ప్రథమ బహుమతి

కరీంనగర్ టౌన్, ఏప్రిల్ 26: న్యూ ఢిల్లీ విద్యాభారతి నిర్వహించిన వ్యాసరచన పోటీల్లో కరీంనగర్ శ్రీసరస్వతీ శిశు మందిర్ ఉన్నత పాఠశాల ఇంగ్లీష్ మీడియం విద్యార్థిని నామాల దేవిశ్రీ (7వతరగతి) అత్యుత్తమ ప్రతిభ కనబరిచి జాతీయస్థాయిలో ప్రథమ బహుమతి సాధించినట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయులు సముద్రాల రాజమౌళి ఒక ప్రకటనలో తెలిపారు. ప్రథమ బహుమతి సాధించిన నామాల దేవిశ్రీని పాఠశాల కార్యదర్శి, ఇంజనీర్ కోల అన్నారెడ్డి, అధ్యక్షుడు బల్మూరి కరుణాకర్ రావు, కమిటీ, సమితి సభ్యులు, ఆచార్యులు అభినందించారు.

చలి వేంద్రం ప్రారంభం

కరీంనగర్ టౌన్, ఏప్రిల్ 26: నగరంలోని మంకమ్మతోటలో మహాదేవ్ సేవ ఫౌండేషన్ ఆధ్వర్యంలో చలివేంద్రాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో ఫౌండేషన్ ప్రధాన కార్యదర్శి మామిడాల సుమంత్ సభ్యులు పాల్గొన్నారు.

ప్రశాంతంగా ఓపెన్ స్కూల్ పరీక్షలు

కరీంనగర్ టౌన్, ఏప్రిల్ 26: జిల్లాలో తెలంగాణ ఓపెన్‌స్కూల్ పబ్లిక్ పరీక్షలు ప్రశాంతంగా జరుగుతున్నట్లు జిల్లా విద్యాశాఖ అధికారి సీహెచ్‌వీఎస్ జనార్దన్‌రావు, ఉమ్మడి జిల్లా ఓపెన్ స్కూల్ కోఆర్డినేటర్ చల్వాజీ నాగేశ్వర్‌రావు ఒక సంయుక్త ప్రకటనలో తెలిపారు. శుక్రవారం జరిగిన ఎసెస్సీ పరీక్షలకు 90శాతం, మధ్యాహ్నం జరిగిన ఇంటర్ పరీక్షలకు 94శాతం విద్యార్థులు హాజరయ్యారని తెలిపారు.

మాదిగలను విస్మరించిన కాంగ్రెస్

సుభాష్‌నగర్, ఏప్రిల్ 26: రాష్ట్రంలో అధికంగా ఉన్న మాదిగలను కాంగ్రెస్ పార్టీ విస్మరించిందని కార్పోరేటర్ కంసాల శ్రీనివాస్ అన్నారు. శుక్రవారం నగరంలోని దళిత సంఘాలు నిర్వహించిన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఎస్సీ రిజర్వేషన్ స్థానాల్లో ఒక్క సీటుకూడా మాదిగలకు కెటాయించలేదన్నారు. కాంగ్రెస్ పార్టీ మొదటి నుంచి మదిగల పట్ల పక్షపాత ధోరణి అవలంభిస్తుందని ఆరోపించారు. పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థి వినోద్‌కుమార్‌కు సంపూర్ణ మద్దతు తెలిపి భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. సమావేశంలో దర్పల్లి క్రాంతి, కల్లెపల్లి నవీన్, ఆసంపల్లి వినయ్, చిలుముల మహేందర్, దర్పల్లి అంజి పాల్గొన్నారు.

లంక శేఖర్‌పై రౌడీషీట్ ఓపెన్

కరీంనగర్ క్రైం, ఏప్రిల్ 26: కరీంనగర్ విద్యారణ్యపురికి చెందిన లంక శేఖర్‌పై శుక్రవారం రోజు కరీంనగర్ రూరల్ పోలీసు ఠాణాలో రౌడీ షీట్ ఓపెన్ చేశామని సీఐ ఏ ప్రదీప్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. ఇటీవల వరుస నేరాలకు పాల్పడుతూ శాంతి భద్రతలకు విఘాతం కలుగచేస్తూ ప్రజల శాంతికి భంగం కలిగించడమే కాకుండా, బెదిరింపులకు గురిచేసి భూ ఆక్రమణలకు పాల్పడుతున్నాడు. సీఐ ప్రతిపాదన మేరకు కరీంనగర్ రూరల్ ఏసీపీ అనుమతించగా రౌడీషీట్ ఓపెన్ చేసి అతని కదలికలపై నిఘా ఉంచాలని సూచించారు. ఇప్పటి వరకు నాలుగు కేసుల్లో ప్రధాననిందితుడిగా ఉన్నాడని తెలిపారు.

బీఆర్ఎస్‌ను ఆదరించాలి

హుజూరాబాద్, ఏప్రిల్ 26: పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థులను గెలిపించాలని బీఆర్ఎస్వీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రావుల రాజలింగారెడ్డి కోరారు. హుజూరాబాద్‌లో శుక్రవారం ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ ఆరు గ్యారెంటీల పేరుతో దొంగ హామీలు ఇచ్చి ప్రజలను బురిడి కొట్టించారన్నారు. కాంగ్రెస్ మెడలు వంచి ఇచ్చిన హామీలు అమలు చేయించాలంటే ఈ పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ గెలవాలన్నారు. మే 2న జమ్మికుంటలో జరిగే కేసీఆర్ రోడ్ షోకు బీఆర్ఎస్ కార్యకర్తలు, నాయకులు అభిమానులు పెద్దఎత్తున హాజరై విజయవంతం చేయాలని కోరారు.

ఆలయంలో ప్రత్యేక పూజలు

రామడుగు, ఏప్రిల్ 26 : మండలంలోని దేశ్‌రాజ్‌పల్లి శివారు గ్రామమైన ఔదరిపల్లిలోని వీరాంజనేయ ఆలయంలో శుక్రవారం ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా విగ్రహధ్వజ స్తంభ ప్రతిష్టాపన కార్యక్రమం నిర్వహించారు. నాలుగు రోజులుగా ఆలయంలో జరుగుతున్న కార్యక్రమంలో భాగంగా చివరి రోజు వేదపండితుల మంత్రోత్సవాల మధ్య కార్యక్రమాన్ని వైభవంగా నిర్వహించారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు.

సమస్యలు పరిష్కరించాలని సెల్ టవర్ ఎక్కిన యువకుడు

మానకొండూర్, ఏప్రిల్ 26: మండలంలోని వెల్ది గ్రామంలో సమస్యలు పరిష్కరిం చాలని ఓ యువకుడు శుక్రవారం సెల్ టవర్ ఎక్కాడు. వివరాలు ఇలా ఉన్నాయి మండలంలోని వెల్ది గ్రామానికి చెందిన వడ్లూరి శ్రావణ్(34) అనే యువకుడికి అదే గ్రామానికి చెందిన యువతితో వివాహం అయింది. రెండు కుటుంబాల మధ్య గొడవలు జరగడంతో భార్య కాపురానికి రావడంలేదు. అంతే కాకుండా భూసమస్యలు పరిష్కరం కావడం లేదని ఉదయం 8గంటలకు సెల్ టవర్ ఎక్కి నిరసన వ్యక్తం చేశాడు. సమాచారం తెలుసుకున్న గ్రామస్థులు అక్కడికి స్థలానికి చేరుకొని టవర్ దిగాలని కోరినా శ్రావణ్ వినిపించుకోలేదు. భార్యను కాపురానికి పంపించడమే కాకుండా భూ సమస్యను పరిష్కరిస్తామని పోలీసులు, గ్రామస్థులు హామీఇవ్వడంతో మధ్యాహ్నం సెల్‌టవర్ దిగాడు.

బాధితులకు స్వచ్ఛంద సంస్థ చేయూత

రామడుగు, ఏప్రిల్ 26: రోడ్డు ప్రమాదంలో గాయపడి హైదరాబాద్‌లో చికిత్స పొందుతున్న మండలంలోని గోపాల్‌రావుపేట్ గ్రామానికి చెందిన ఏగోలపు మల్లేశం, భారతమ్మ దంపతులకు శ్రీ లక్ష్మీనర్సింహస్వామి స్వచ్ఛంద సేవా సంస్థ శుక్రవారం రూ. 12వేల ఆర్థిక సహాయం అందజేశారు. కార్యక్రమంలో సంస్థ అధ్యక్ష కార్యదర్శులు దాసరి కనుకయ్య, దాసరి రవిశాస్త్రి, గౌరవాధ్యక్షులు ఓద్దుల హన్మంతరెడ్డి, కోశాధికారి దాసరి మల్లేశం పాల్గొన్నారు.

కాంగ్రెస్ సమన్వయ కమిటీ సమావేశం

కరీంనగర్ అర్బన్, ఏప్రిల్ 26: కరీంనగర్ లోక్‌సభ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి వెలిచాల రాజేందర్‌రావుకు మద్దతుగా కరీంనగర్ కార్పొరేషన్ పరిధిలోని 60 డివిజన్‌లలో బూత్ స్థాయిలో ప్రచారం నిర్వహించేందుకు సమన్వయ కమిటీ సభ్యులు శుక్రవారం కాంగ్రెస్‌పార్టీ అభ్యర్థి వెలిచాల రాజేందర్‌రావు నివాసంలో మొదటిసారిగా సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ప్రచార నిర్వహణలో అనుసరించవలసిన వ్యూహంపై చర్చించారు. ఈ సమావేశంలో సమన్వయకర్త వైద్యుల అంజన్‌కుమార్, కమిటీ సభ్యులు మాజీ ఎమ్మెల్యేలు ఆరెపల్లి మోహన్, కోడూరి సత్యనారాయణగౌడ్, నగర కాంగ్రెస్ అధ్యక్షుడు కోమటిరెడ్డి నరేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రేపు శ్రీపద మంజీరాలు పుస్తకావిష్కరణ

కరీంనగర్ కల్చరల్, ఏప్రిల్ 26: భవానీ సాహిత్యవేదిక ఆధ్వర్యంలో రచయిత, ఎన్టీపిసి విశ్రాంత డిప్యూటీ మేనేజర్(ఫైనాన్స్) నగునూరి రాజన్న రచించిన శ్రీపద మంజీరాలు శ్రీపదాల సంపుటి ఆవిష్కరణను ఆదివారం ఉదయం 9-30 గంటలకు వాగీశ్వరి డిగ్రీ కళాశాలలో నిర్వహిస్తున్నట్లు గుండు రమణయ్య, వైరాగ్యం ప్రభాకర్ ఒక ప్రకటనలో తెలిపారు. కార్యక్రమానికి సినీ గేయ రచయిత, నంది పురస్కార గ్రహీత సాదనాల వెంకటస్వామి ముఖ్యఅతిథిగా హాజరవుతారని పేర్కొన్నారు. కవులు, రచయితలు, సాహిత్యాభిమానులు పాల్గొనాలని కోరారు.